


మా కలం - సామాన్యుడి బలం

# నంది పత్రిక

జాతీయ తెలుగు దిన పత్రిక

GSTIN 37AMRPM5719R1ZX

RNI-APTEL/2023/88162

ఎడిటర్: మహేష్ యాదవ్ | తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి : 4 | సంచిక : 86 | శుక్రవారం 27 - 03 -2026 | పేజీలు : 12 | వెల-3


## నేడే సీతారామ కల్యాణం



# 14 మంది సజీవ దహనం

2లో





టిప్పర్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

ఏపీలోని మార్కాపురం జిల్లాలో ఘటన

- 23మందికి గాయాలు
- వారిలో ఐదుగురి పరిస్థితి విషమం
- కిటికీ అద్దాలు పగులగొట్టి బయటపడ్డ కొందరు
- హైదరాబాద్ నుంచి పామూరు వెళ్తుండగా ఘటన
- మృతుల్లో ఇద్దరు జగిత్యాల జిల్లా రాయికల్ వాసులు

## నేడు రాష్ట్రాలసిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్



### పశ్చిమాసియా పరిస్థితులపై రాష్ట్రాలకు వివరించే ఛాన్స్

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరింత అప్రమత్తమయ్యింది. ఈ క్రమంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ శుక్రవారం వర్చువల్‌గా సమావేశం కానున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వారితో మాట్లాడనున్న ఆయన.. పశ్చిమాసియాలో పరిస్థితులు, భారత్ అనుసరిస్తున్న విధానాలను వివరించనున్నట్లు సమాచారం. అదేవిధంగా ఆయా రాష్ట్రాల సన్నద్ధత, సహకారంపై చర్చించనున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాత్రం ఈ సమావేశానికి దూరంగా ఉండనున్నట్లు తెలిసింది.

2లో

## అమరావతి తీర్మానం ఓ డ్రామా

- ప్రజలను మభ్య పెట్టే ఎత్తుగడ
- రైతులను నిండా ముంచి మభ్య పెట్టారు
- అవినీతి నుంచి ప్రజల దృష్టి మళ్లించే యత్నం
- అసెంబ్లీ తీర్మానం సరే..మండలిలో ఎందుకు చేయడం లేదు
- మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేసిన వైసిపి నేత సజ్జల

2లో



అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. ఇది ప్రజలను మభ్యపెట్టడానికి చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల ధ్వజమెత్తారు. అమరావతి కోసం అసెంబ్లీలో చంద్రబాబు తీర్మానం పెట్టడంపై సజ్జల అనేక ప్రశ్నలు సంధించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమరావతి పేరిట అవినీతి నుంచి, రైతులకు



## అమరావతికి చట్టబద్ధత

### క్యాబినెట్ కీలక తీర్మానం

- రాష్ట్ర రాజధానిగా అమరావతిని కొనసాగిస్తూ తీర్మానం
- కొత్త రాజధాని స్థానంలో అమరావతి పేరును చేర్చాలని నిర్ణయం
- 96 జూనియర్, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టుల ఏర్పాటు
- వడ్డెర సంఘాలకు ప్రాధాన్య క్రమంలో ఖనిజ లీజులు
- ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

2లో

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఏపీ పునర్విభజన చట్టంలో సవరణలతో పాటు, అమరావతిని శాశ్వత రాజధానిగా కొనసాగించేందుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలని నిర్ణయించింది.

ఏపీ పునర్విభజన చట్టం2014లోని సెక్షన్-5ను సవరించి, సీఆర్డీఏ పరిధిలోని అమరావతిని రాష్ట్ర రాజధానిగా చేర్చాలని మంత్రివర్గం తీర్మానించింది. భవిష్యత్తులో ఎవరూ రాజకీయ కారణాలతో రాజధానిని మార్చకుండా ఉండేందుకు అసెంబ్లీలో కూడా ప్రత్యేక తీర్మానం చేయాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అమరావతిని దెబ్బతీసిందని విమర్శించిన మంత్రి, ఇప్పుడు శాశ్వత రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అమరావతిని రాష్ట్ర ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

## ముద్రగడ పద్మనాభంతో అంబటి రాంబాబు భేటీ



ఏపీ రాజకీయాల్లో కాపు సామాజికవర్గ సమీకరణాలు మళ్లీ వేడెక్కుతున్నాయి. కాకినాడ జిల్లా కిర్లంపూడిలో వైసీపీ నేత ముద్రగడ పద్మనాభంను మాజీ మంత్రి అంబటి రాంబాబు కలిశారు. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ ముద్రగడ పట్టుదల, నిజాయతీని ప్రశంసించారు. గతంలో ముద్రగడ కుటుంబాన్ని పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ, ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముద్రగడ తమ కాపు కులంలో పుట్టినందుకు గర్విస్తున్నానని చెప్పారు. తనపై ఎన్ని కేసులు పెట్టినా, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని, తన కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు పోరాడుతూనే ఉంటానని ఆంబటి స్పష్టం చేశారు. ముఖ్యంగా పోలీసులు తనను హింసించారని, అర్ధరాత్రి వేళల్లో ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు.

## నిలకడగా సోనియా ఆరోగ్యం



2లో

### గంగారాం ఆస్పత్రి వైద్యుల వెల్లడి

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. గత కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. మార్చి 24వ తేదీ రాత్రి జ్వరం కారణంగా ఆమె

## రామరాజ్య స్థాపనకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి

2లో

శ్రీరామనవమి మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ధర్మానికి, సుపరిపాలనకు శ్రీరామ చంద్రుడు ప్రతీక అని కొనియాడారు. ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడైన శ్రీరాముడు అవతరించిన, ఆయన కల్యాణం జరిగిన పవిత్రమైన రోజే శ్రీరామనవమి అని చంద్రబాబు






2లో

## తల వంచిన ట్రంప్!

ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతున్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమ కూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేశా రు. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. దీనికి కారణాలేమిటి? లక్ష్యం లేకపోవటం: ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా-ఇజ్రాయెల్‌లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది.

## చంద్రబాబు పక్కా ప్రణాళికతో ఉన్నారు: కుప్పంలో నారా భువనేశ్వరి



రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పరిశ్రమల రాకతో కుప్పం నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికోసం ఒక సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళుతున్నారని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. తన నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా మూడో రోజైన గురువారం ఆమె పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శాంతిపురం మండలంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం, రామకుప్పంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు.

2లో

# అమరావతి తీర్మానం ఓ డ్రామా

పరిష్కారం కాని అంశాల నుంచి పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? , ఎవరు అభ్యంతరం చెప్పారు, ఎవరు అడ్డంకులు చెప్పారన్న దానికి చంద్రబాబు వివరణ ఇవ్వాలన్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి, అంతా చేసేశానని చంద్రబాబు చెప్పుకోవాలని అనుకుంటున్నారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలి కదా?, కానీ, అమరావతి లో చంద్రబాబు అవినీతి, వ్యవహరిస్తున్న తీరును ప్రశ్నిస్తారనే మండలిని పిలవటం లేదా అని నిలదీసారు. శాశ్వత రాజధానిని నిర్మించి, ప్రజలకు వేగంగా అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చంద్రబాబు ఎప్పుడూ చేయలేదు, అలాకాకుండా రాజధాని అంశాన్ని శాశ్వత కామధేనువుగా మార్చాడు, అమరావతిలో చంద్రబాబు అవినీతి యజ్ఞం చేస్తున్నారు' అని సజ్జల మండిపడ్డారు. ఃరాజధాని విషయంలో చంద్రబాబుకు ఆచరాణాత్మక ధోరణి ఇప్పటికీ లేదు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధి వికేంద్రీకరణలో అమరావతికీ స్థానం ఉంది, అయితే ఇదంతా గతంలో జరిగిన పరిణామాలు. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చారు, వచ్చాక కూడా ఏమీ చేయడం లేదు. చంద్రబాబు ఊహాజనిత రాజధాని, దానికయ్యే ఖర్చు ఎంత అవుతుంది అన్నదానిపై మేం ప్రశ్నలు వేశాం. అంతే తప్ప అమరావతి ప్రాంతానికి ఎప్పుడూ జగన్ వ్యతిరేకం కాదు. అందుకనే 2019లో అధికారంలోకి రాకముందే జగన్ ఇక్కడ ఇల్లు కట్టుకున్నారు. అమరావతి ప్రాంతానికి వైఎస్సార్‌సీపీ ఆ రోజూకాని, ఈ రోజుకాని ఎప్పుడూ అభ్యంతరం చెప్పలేదు. మేం అభ్యంతరం వ్యక్తం చేసేది అవినీతి మీద, దోపిడీ మీద. రైతుల సమస్యలను ఇప్పటికీ పరిష్కరించలేదు. పిల్లల పెళ్లిళ్లు కూడా రైతులు చేయలేకపోతున్నారు. చంద్రబాబు ప్రణాళిక ప్రకారం కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.2 లక్షల కోట్లు కావాలి. 2014-19లో ఐదేళ్లలో ఖర్చు చేసింది రూ.5వేల కోట్లే. ఇప్పుడు కూడా చేసింది ఏమీ లేదు. ఇప్పుడు చదరపు అడుగుకు రూ.19వేల వరకూ పెంచారు. అమరావతిలో పాత బిల్డింగులు కాక, ఈ రెండేళ్లలో కొత్తగా కట్టారా?, మళ్లీ డిజైన్ల పేరిట రూ.400 కోట్లు ఖర్చుచేస్తున్నారు. 2018లో టెండర్లు ఖరారై, పనులు ప్రాంభమైన వాటికి కూడా మళ్లీ టెండర్లు పిలిచారు. కాంట్రాక్టర్లతో గూడు పుఠానీ చేశారు. అందరికీ 4శాతం కంటే ఎక్కువ టెండర్లు ఖర్చు పెట్టారు. చంద్రబాబు తీరును చూసి, అమరావతి పేరిట చేసిన దోపిడీని చూసి రాష్ట్రం భయపడతోంది. చంద్రబాబు సృష్టించిన అవినీతి ఊబిలో రాష్ట్రం ఎక్కడకు పోతుందో తెలియడంలేదు. ప్రజల సొమ్ము, రాష్ట్ర వనరులను పీల్చి పిప్పిచేస్తున్నారు. ప్రజల భవిష్యత్తును, రాష్ట్ర భవిష్యత్తును చీకట్లో పెడుతున్నారు. అమరావతి గురించి ఆర్టీఐ కింద ప్రశ్నలు వేసినా సమాచారం ఇవ్వడంలేదు. అమరావతి పనుల్లో ఎక్కడా పారదర్శకత లేదు. ఈ విడతలో రూ.9వేలకోట్లు తెచ్చి, రూ.5వేల కోట్లు మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చారు. సుమారు 47వేల కోట్లకు శాంక్షన్లు ఇచ్చారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే.. అమరావతికి వ్యతిరేకం అని ముద్ర వేస్తున్నారు. ఃరాజధాని ప్రాంతానికి కనెక్టివిటీకోసం ఏమైనా చేశారా?, ఇప్పటికీ కరకట్ట రోడ్డే కదా గతి. వచ్చినా వెస్ట్రన్ బైపాస్ కూడా పూర్తిచేసింది వైఎస్సార్‌సీపీ హయాంలోనే కదా. పనులు ఏమీ చేయకపోయినా, ప్రజలను నిరంతరం భ్రమల్లో పెట్టాలన్నదే చంద్రబాబు ప్లాన్. మొదటి రోజు నుంచి ఇప్పటివరకూ అమరావతి విషయంలో వివరాలు ప్రభుత్వం బయటపెట్టగలదా?, మొదటి విడత భూములు తీసుకున్న రైతులకే ఏమీ చేయలేదు. కాని, రెండో విడత అంటూ మళ్లీ వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. అమరావతిలో జోరుగా జరుగుతున్న పనులు కేవలం చంద్రబాబు ఇల్లు మాత్రమే. అమరావతి పేరుమీ అప్పులు తెస్తున్నారు, మొబలైజేషన్ అడ్వాన్స్‌లు ఇస్తున్నారు, కమిషన్లు కొట్టేస్తున్నారు. రైతులకు ఇచ్చిన ప్లాట్లను ఎందుకు అభివృద్ధి చేయడం లేదు?, దీనికి ఎవరు అడ్డుపడ్డారు. చెరువుల్లో కూడా రైతులకు ప్లాట్లు ఇచ్చి వారిని నట్టేటా ముంచారు. ఎవరైనా దీన్ని ప్రశ్నిస్తే.. మళ్లీ వారిమీద ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారు. చంద్రబాబుకు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు అమరావతి పనుల కమిషన్లకు సంబంధించే వచ్చాయి. రూ.2వేల కోట్ల అవినీతిపై ఆరోజు ఇన్‌కంట్యాక్స్ నోటీసులు వచ్చాయి. చంద్రబాబు పీఏ శ్రీనివాస్‌కు కమిషన్లు, లంచాలు వెళ్లాయని ఆ నోటీసుల్లో ఉంది. ఈ నోటీసులపై విచారణ ఆగిపోయింది. అమరావతిలో చంద్రబాబు అవినీతికి నిదర్శనానికి ఈ నోటీసులే. అమరావతి నిర్మాణాలు, అంచనాలు, అప్పులు చూస్తే ప్రజల గుండెలు అదిరిపోతున్నాయి. సెల్ఫ్ ఫైనాన్స్ సిటీ అంటూనే అప్పులు చేస్తున్నారు. అమరావతిలో చంద్రబాబు. కట్టాలనుకుంటున్న భవనాల నిర్వహణ ఖర్చులు వింటేనే ప్రజలకు భయం వేస్తోంది. ఆచరాణాత్మకంగా, వాస్తవిక దృక్పథంతో చంద్రబాబు ఆలోచన లేదు. పనులు కన్నా, భ్రమలను కలిగిండచమే చంద్రబాబు ఉద్దేశం. చంద్రబాబు గతంలో చెప్పిన హైపర్ లూప్ ఏమయ్యింది?, అమరావతిలో ఒలింపిక్స్ ఏమయ్యాయి?' అని సజ్జల ప్రశ్నించారు. అమరావతి పేరుతో రైతుల సమస్యల్ని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అమరావతి కోసం అసెంబ్లీలో తీర్మానం అన్నది చంద్రబాబు డ్రామా అని విమర్శించారు. అందుకే 2019 లో అధికారంలోకి రాకముందే మాజీ సిఎం వైసిపి జగన్ మోహన్ రెడ్డి ఇక్కడ ఇల్లు కట్టుకున్నారని తెలియజేశారు. అమరావతి కోసం తీర్మానం చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించారు. అసెంబ్లీతో పాటు, మండలిని కూడా సమావేశపరచాలని కదా? అని అన్నారు. రాజధాని పేరుతో చంద్రబాబు చేస్తున్న దోపిడీపైనే వైసిపి అభ్యంతరం చెప్పింది అని అన్నారు. ప్రజల్ని మభ్య పెట్టడానికి ప్రభుత్వం చేస్తున్న ఎత్తుగడ అని సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు.

# 14మంది సజీవ దహనం

మార్కాపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రాయవరం సమీపంలో పలకల క్వారీల వద్ద టిప్పర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో బస్సుతో పాటు టిప్పర్‌లోనూ మంటలు చెలరేగాయి. ప్రమాదంలో బస్సులోని 14 మంది ప్రయాణికులు సజీవ దహనమయ్యారు. వారి మృతదేహాలను వెలికితీశారు. మరో 28 మందికి గాయాలయ్యాయి. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదంతో బస్సు, టిప్పర్ పూర్తిగా దగ్ధమయ్యాయి. బస్సును హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందినదిగా గుర్తించారు. గురువారం తెల్లవారు జామున ఆరుగంటల సమయంలో ఈ ఘోరం జరిగింది. ఘటనాస్థలికి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను మార్కాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. బస్సు తెలంగాణలోని జగిత్యాల నుంచి నెల్లూరు జిల్లా కనిగిరికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఘటన జరిగిన సమయంలో బస్సులో 41 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీరిలో బస్సు వెనుక భాగంలో ఉన్నవారు బయటకు రాలేక మృతిచెందినట్లు తెలుస్తోంది. ముందు భాగంలో ఉన్నవారు ప్రాణాలతో బయటపడ్డారు. మృతుల్లో కనిగిరి, వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. ఘటనాస్థలాన్ని మార్కాపురం జేసీ శ్రీనివాసులు, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరిశీలించారు. మృతుల వివరాలు.. సీహెచ్ మనోజ్‌కుమార్ (18), వింజమూరు, సీహెచ్ సుజాత (45), వింజమూరు, సీహెచ్ మేఘన (19), వింజమూరు, టి. నరేంద్ర (25), నల్లగొండ్ల, టి. చందన (21), నల్లగొండ్ల, టి. చందు (6), నల్లగొండ్ల , కె. ప్రకాశ్ (17), అయ్యవారిపల్లె, కె.అయ్యన్న (18), (ఎర్రబొట్లపల్లె) వి. గురవయ్య (60), చింతగుంట్ల, కె.అబ్రహం (42), చోడవరం, పి.మహేంద్రరెడ్డి (17), చోడవరం రామచంద్ర ప్రవీణ్ (21), చోడవరం, ఎ.సౌజన్య (22), పెదారికట్ల ఉన్నారు. ఈ ప్రమాదంపై సీఎం చంద్రబాబు,ప్రధాని మోడీ, మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బస్సులోని పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలోనినిర్మల్ నుంచి నెల్లూరుకు ఈ బస్సు వెళుతున్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలన్నారు. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. బస్సు ప్రమాదంపై మంత్రులు నారా లోకేశ్, గొట్టిపాటి రవికుమార్, మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, బీసీ జనార్దన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు.

# నేడు రాష్ట్రాల సిఎంలతో ప్రధాని వీడియో కాన్ఫరెన్స్

అయితే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతో కేబినెట్ సెక్రటరీ ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. ప్రధాని-సీఎంల వీడియో కాన్ఫరెన్స్‌లో తీసుకున్న వివరాలను సీఎస్‌లకు వెల్లడించి.. ఆయా రాష్ట్రాల్లో అమలు చేసేలా కేబినెట్ సెక్రటరీ సూచించనున్నట్లు సమాచారం. ఇటీవల పార్లమెంటు ఉభయసభల్లో మాట్లాడిన ప్రధాని మోదీ.. యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్లిష్ట పరిస్థితులు దీర్ఘకాలం కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇది పరీక్షా సమయమేనని తెలిపారు. సంక్షోభం నుంచి బయటపడటంలో రాష్ట్రాలన్నీ కేంద్రంతో కలిసి టీమ్ ఇండియాలా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ప్రజలు సిద్ధమై ఉండాలని కోరారు. ఈ క్రమంలోనే అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశానికి సిద్ధమవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశంలో పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తిన సంక్షోభంపై కీలక సూచనలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం దేశంలో చమురు, గ్యాస్‌పై విపరీతంగా వదంతులు వ్యాపిస్తున్నాయి. మధ్యప్రాచ్యం యుద్ధం కొనసాగితే.. ఎదురయ్యే ఇబ్బందులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై మోడీ దిశానిర్దేశర చేయనున్నారు. గత నెల 28 నుంచి పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా దాడి చేశాయి. ఈ ఘటనలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా లీ ఖమేనీ హతమయ్యాడు. దీంతో ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. గల్ఫ్ దేశాల్లోని ఇంధన, గ్యాస్ క్షేత్రాలపై క్షిపణులతో విరుచుకుపడింది. అంతేకాకుండా హోర్ముజ్ జలసంధిని కూడా మూసేసింది. దీంతో ప్రపంచ దేశాల్లో చమురు, గ్యాస్ కష్టాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఇప్పటికే ఆయా దేశాల్లో అత్యవసర పరిస్థితులు అమలు అవుతున్నాయి. అలాగే భారత్‌లో కూడా కరోనా కాలం నాటి లాక్‌డౌన్ పరిస్థితులు వస్తాయంటూ పుకార్లు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సమావేశం నిర్వహించడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

# అమరావతికి చట్టబద్ధత..

**ఉద్యోగాల కేటాయింపునకు ఆమోదం** ఇక న్యాయ వ్యవస్థ బలోపేతానికి హైకోర్టు సూచనల మేరకు 96 కొత్త కోర్టుల ఏర్పాటు, 1730 ఉద్యోగాల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నియామకాలను జాబ్ క్యాలెండర్‌లో చేర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వడ్డెర సొసైటీలకు 15 శాతం క్వారీ లీజులు కేటాయిస్తూ, సీనరేజీపై 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. కుప్పంలో మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ స్కూల్‌లో సిబ్బంది నియామకానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

**సింగిల్ టైం సెటిల్‌మెంట్** పట్టణాల్లో పెండింగ్ పన్ను బకాయిల పరిష్కారానికి సింగిల్ టైం సెటిల్‌మెంట్ విధానానికి ఆమోదం తెలిపారు. అదే సమయంలో పోలవరం ప్రాజెక్ట్‌కు సంబంధించి పునరావాస భూముల విలువ పెంపుతో పాటు, ఎకరాకు పరిహారం రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచారు. ఇందుకు రూ.565 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. అలాగే పోలవరం లిఫ్ట్ స్కీమ్ పనుల కొనసాగింపుకు అనుమతి ఇచ్చిన మంత్రివర్గం, కర్నూలు జిల్లా గురు రాఘవేంద్ర ప్రాజెక్ట్‌లో లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరు చేసింది.

**పీఎన్‌జీ కనెక్షన్లు పెంపు** పట్టణాల్లో పైప్డ్ నేచురల్ గ్యాస్ (గ్రాచీ+) కనెక్షన్లను 9 లక్షల వరకు పెంచేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. పీఎన్‌జీ వినియోగదారులకు దీపం పథకం కింద రాయితీలు కొనసాగించనున్నారు. రాష్ట్రంలో పెరుగుతున్న బస్సు ప్రమాదాలపై కూడా క్యాబినెట్ చర్చించి రోడ్ల నాణ్యత, వాహనాల అనుమతులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు.

**అగ్ని ప్రమాదాలపై విచారణ** ఇక అమరావతిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాలపై ప్రభుత్వం అనుమానం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించింది. కొన్ని ఘటనలు ఉద్దేశపూర్వకంగా జరిగి ఉండొచ్చని భావిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. మొత్తానికి, అమరావతిని శాశ్వత రాజధానిగా నిలబెట్టడమే కాకుండా, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంగా మార్చడంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు స్పష్టం చేశారు

# చంద్రబాబు పక్కా ప్రణాళికతో ఉన్నారు



ఈ పర్యటనలో భాగంగా తొలుత శాంతిపురంలోని నివాసంలో స్థానిక టీడీపీ నేతలతో నారా భువనేశ్వరి సమావేశమయ్యారు. అనంతరం ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఐటీడీపీ కార్యకర్త రవి కుటుంబాన్ని, ఇతర అనారోగ్య సమస్యలతో మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రామకుప్పంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావడంతో ఆమె వారితో కలిసి కిలోమీటరు దూరం నడిచారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. "సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్లు" అనే నినాదంతో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. రెండు రూపాయలకే కిలో బియ్యం అందించి పేదల ఆకలి తీర్చిన మహనీయుడని కొనియాడారు. దేశంలోనే మొదటిసారి మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి బాటలు వేశారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే ముఖ్యమంత్రి చంద్రబాబు డ్వాక్రా సంఘాలను స్థాపించి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లు, తల్లికి వందనం, ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, సంజీవని ఆరోగ్య పథకం వంటి హామీలను అమలు చేస్తున్నారని వివరించారు. హంద్రీనీవా జలాలను కుప్పానికి తీసుకొచ్చి చంద్రబాబు తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారని, పరిశ్రమల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని భువనేశ్వరి పేర్కొన్నారు. కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే చంద్రబాబు లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.

# తల వంచిన ట్రంప్!

బెడిసికొట్టిన ఆలోచన: వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ప్లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి.

**ఊహకు అందని ప్రత్యర్థి వ్యూహం** ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హోర్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది.

**స్వదేశంలో తీవ్ర నిరసన** అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అబుదాబిపై ఇరాన్ మిస్సైల్ దాడి

## శకలాలు తగిలి ఇద్దరు మృతి

## అందులో ఒకరు భారతీయుడిగా గుర్తింపు

ఇరాన్ - ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధం 27వ రోజుకు చేరుకుంది. ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా వెనకడుగు వేసినా.. ఇజ్రాయెల్ మాత్రం ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇజ్రాయెల్‌తో పాటు అరబ్ దేశాలపై కూడా ఇరాన్ మిస్సైల్స్, డ్రోన్ల దాడులు చేస్తోంది. గురువారం అబుదాబిపై ఇరాన్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ప్రయోగించింది. అబుదాబి ఆ మిస్సైల్‌ను గాల్లోనే పేల్చేసింది. అయితే, మిస్సైల్ తాలూకా శకలాలు మీద పడి ఇద్దరు ప్రాణాలు కోల్పోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. చనిపోయిన వారిలో ఒకరు భారతీయుడు కాగా.. మరొకరిని పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ది అబుదాబి మీడియా ఆఫీస్ ఈ సంఘటపై స్పందించింది. ఈ మేరకు గురువారం ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టింది. ఆ పోస్టులో.. 'ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా బాలిస్టిక్ మిస్సైల్‌ను అడ్డుకుంది. ఈ నేపథ్యంలోనే శకలాలు మీద పడి ఇండియా, పాకిస్థాన్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు చనిపోయారు'అని పేర్కొంది. కాగా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతల కారణంగా మృతి చెందిన భారతీయుల సంఖ్య ఏడుకు చేరింది. ఇరాన్ ప్రయోగిస్తున్న మిస్సైల్స్, డ్రోన్లను యూఏఈ ఏయిర్ డిఫెన్స్ సిస్టమ్ సమర్థవంతంగా అడ్డుకుంటోంది. ఇప్పటి వరకు 372 బాలిస్టిక్ మిస్సైల్స్, 15 క్రూయిస్ మిస్సైల్స్, 1,826 యూఈవీలను యూఏఈ ఏయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసం చేసింది.యుద్ధం విషయంలో వెనక్కు తగ్గిన ట్రంప్ ఇరాన్‌కు తాజాగా హెచ్చరికలు జారీ చేశారు. అమెరికాతో ఒప్పందం విషయంలో మరీ ఆలస్యం చేస్తే పరిస్థితులు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఓ వైపు ఒప్పందం కోసం ప్రయత్నిస్తూనే.. బయటకు మరోలా మాట్లాడుతోందని ఇరాన్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యం అకాకముందే సీరియస్‌గా వ్యవహరించడం మంచిదని హితవు పలికారు.

# రామరాజ్య స్థాపనకు మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి:

వివరించారు. ఈ సందర్భంగా ఆయన ఒక సందేశం విడుదల చేశారు. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన అని, రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. శ్రీరామచంద్రమూర్తి చూపిన బాటలో పయనిస్తూ, ఆయన సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శవంతమైన జీవితం గడపాలని ఆకాంక్షించారు.

ప్రజలందరికీ, వారి కుటుంబ సభ్యులకు ఆ శ్రీరాముడి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తన సందేశంలో పేర్కొన్నారు.

# ఎపిలో పెరుగుతున్న ఎండలు

## పలు జిల్లాల్లో వడ గాలులు వీచే ప్రమాదం

దేశ వ్యాప్తంగా ఎండలు దంచి కొడుతున్నాయి. పలు రాష్ట్రాల్లో 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక, ఆంధ్రప్రదేశ్‌లోనూ రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతూ పోతున్నాయి. మధ్యాహ్నం వేళల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. రాష్ట్రంలో రెండు రోజుల పాటు వడగాడ్పులు వీస్తాయని తెలిపింది. శుక్రవారంపార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలు, పోలవరం జిల్లా చింతూరు..కూనవరం, వరరామచంద్రాపురం, కాకినాడ జిల్లా జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ, ఎన్టీఆర్ జిల్లా జీ.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో తీవ్ర వడగాల్పులు (09) ప్రభావం చూపే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. శుక్రవారం విజయనగరం జిల్లాలో 4 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 3 మండలాలు, పోలవరం జిల్లాలోని 3 మండలాలు, కాకినాడ జిల్లాలో ఒక మండలం, తూర్పుగోదావరిలో 2 మండలాలు, ఏలూరులో 4 మండలాలు, కృష్ణాలో 2 మండలాలు, ఎన్టీఆర్‌లో 7 మండలాలు, గుంటూరులో ఒక మండలం, పల్నాడు జిల్లాలోని 5 మండలాల్లో వడగాడ్పుల ప్రభావం ఉంటుందని వెల్లడించారు. నివారం 90 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందన్నారు. నేడు కడప జిల్లాలోని కమలాపురంలో 40.7 డిగ్రీలు.. అనంతపురం జిల్లాలోని తెరన్నపల్లిలో 40.6 డిగ్రీలు, కృష్ణా జిల్లాలోని పెద్దపారుపూడిలో 40.5 డిగ్రీలు, నంద్యాల జిల్లాలోని కొత్తపల్లెలో 40.4 డిగ్రీలు, కర్నూలు జిల్లాలోని బస్తిపాడులో 40.3 డిగ్రీల చొప్పున అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వెల్లడించారు.

# నిలకడగా సోనియా ఆరోగ్యం

న్యూఢిల్లీలోని సర్ గంగారాం ఆస్పత్రిలో చేరారు. ప్రత్యేక వైద్యుల బృందం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే సోనియా ఆరోగ్యానికి సంబంధించి గంగారాం ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ విజయ్ స్వరూప్ గురువారం హెల్త్ బులిటిన్ విడుదల చేశారు. సోనియా ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని తెలిపారు. చికిత్సకు సోనియా ఆరోగ్యం సహకరిస్తోందని వెల్లడించారు. ఆమెకు సీనియర్ డాక్టర్ల బృందం చికిత్స అందిస్తోందని, ఇంకా పర్యవేక్షణ అవసరం ఉందని తెలిపారు. కాగా, డాక్టర్లు సిస్టమేటిక్ ఇన్‌ఫెక్షన్‌ను నయం చేయడానికి సోనియాకు యాంటీ బయాటిక్స్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా మరికొన్ని రోజులు ఆమెను ఆస్పత్రిలోనే ఉంచి చికిత్స అందించే అవకాశం ఉంది.

# కల్తీ ఆహారం పై తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి

**హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, వీధి వ్యాపార కేంద్రాలలో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు చేయండి - జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు, నంది పత్రిక....**కల్తీ ఆహారం పై తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి ఆహార భద్రత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో కర్నూలు జిల్లాలో ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యతగా తనిఖీ ల నిర్వహణకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక అమలుపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లు, స్వీట్ షాపులు, వీధి వ్యాపార కేంద్రాలలో క్రమం తప్పకుండా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. నిరంతర నిఘా ఉంటేనే కల్తీ రహిత జిల్లాగా కర్నూలును తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందేలా చూడటం ప్రధాన లక్ష్యం అన్నారు. జిల్లాలో ఉన్న ఫుడ్ స్టాల్స్‌పై తనిఖీలను నిర్వహించేందుకు ఒక కార్యాచరణను రూపొందించి, రాబోయే మూడు నాలుగు నెలల్లో తనిఖీలను పూర్తి చేయాలని కలెక్టర్ ఫుడ్ సేఫ్టీ అధికారులను ఆదేశించారు. ఆహార పదార్థాలలో అసలైన వస్తువు ఏదో, నకిలీ వస్తువు ఏదో ప్రజలకు అర్థమయ్యేలా తెలియజేయడానికి ఒక పట్టిక రూపంలో సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. కల్తీ లేని ఆహారంపై ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన పెంచడానికి డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో డెమోలు (ప్రదర్శన)లను ఏర్పాటు చేయాలన్నారు. జూన్ నెల నుండి పాఠశాలలు పునఃప్రారంభమైనప్పుడు సంబంధిత డెమో లను మరింత విస్తృతంగా చేపట్టాలన్నారు.రెస్టారెంట్ లలో బిర్యానీలలో కలర్ లు కలపడం, అమ్ముడవని చికెన్ బిర్యానీ, చికెన్ ఫ్రై ను ఫ్రిజ్‌లో పెట్టి, మరుసటి రోజు కస్టమర్లకు వేడి చేసి కస్టమర్లకు ఇవ్వకూడదని, వాడిన నూనెనే మళ్ళీ మళ్ళీ వేడి చేసి వాడటం, స్ట్రీట్ ఫుడ్ ల గోబీ లలో కలర్ లు కలపడం, చైనీస్ సాల్ట్ వాడడం లాంటివి చేయకుండా నిరంతరం తనిఖీలు చేయాలని, ప్రజారోగ్యమే పరమావధిగా అధికారులు పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజా గోపాల్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కూర్మ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# డంపింగ్ యార్డులో భారీగా ఎగిసి పడిన మంటలు.





**బేతంచెర్ల మార్చి 26 ( నందిపత్రిక ).** బేతంచెర్ల పట్టణ శివారు ప్రాంతం టౌన్ నుండి బనగానపల్లె కు పోవు రహదారి ప్రక్కన జంగాల పేట అతి సమీపంలో ఉన్న డంప్ యార్డులో బుధవారం రాత్రి భారీగా మంటలు ఎగిసి పడ్డాయి. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్ల,డంప్ యార్డులో భారీగా మంటలు ఎగిసి, దట్టమైన పొగ వల్ల,ఆప్రాంతం పొగతో కమ్ముకు పోయి, చిమ్మ చీకటిగా మారింది.ఎంత ప్రయత్నించినా మంటలు అదుపు లోకి రాలేదు. కాలనీ వాసులు మండల అధికారులకు సమాచారం ఇచ్చారు.బేతంచెర్ల నగర పంచాయితి కమీషనర్ హరిప్రసాద్, డోన్ అగ్నిమాపక సిబ్బందికి,డంప్ యార్డు అంటుకున్న విషయంపై,రాత్రి మాట్లాడటం జరిగింది. ఎట్ట కేలకు డోన్ నుండి వచ్చిన అగ్ని మాపక సిబ్బంది వచ్చి, మంటలను ఆర్పివేయడం జరిగింది.రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, నగర పంచాయితి ఏఈ మధు తేజ, నగర పంచాయితి సిబ్బంది, స్థానిక పోలీసులు, సంజీవ నగర్, సుబ్బారెడ్డి నగర్, జంగాల పేట కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# బండి ఆత్మకూరులో చలివేంద్రం ఏర్పాటు



**బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 26:** బండి ఆత్మకూరు బస్టాండ్ లో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని బండి ఆత్మకూరు మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు నందిపాటి నరసింహారెడ్డి, గ్రామ అధ్యక్షుడు బైరెడ్డి లక్ష్మిరెడ్డి టీడీపీ క్లస్టర్ ఇంచార్జి బొల్లవరం మహేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి మధు డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం రెడ్డి, కార్యదర్శి అక్బర్ తదితరులు ప్రారంభించారు. వేసవికాలంలో ఎండ వేడిమికి అలసిపోయిన బాటసారుల దాహార్తిని తీర్చేందుకు గాను ఇక మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎండల నుండి ఉపశమనం కలిగించడం, దాహార్తిని తీర్చడం చలివేంద్రం కేంద్రం యొక్క ముఖ్య ఉద్దేశం. చలువ పందిళ్ళ మధ్య మట్టికుండలలో నీరు పోయడం వల్ల సహజంగా చల్లగా ఉండటంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటుంది. బాటసారులకు ఎంతో మేలు చేసే సేవా కేంద్రం చలివేంద్రం. చలివేంద్రం ఆరంభం రోజు ప్రజలకు మజ్జిగ పోసి బాటసారు లకు దాహార్తిని తీర్చారు. గ్రామ పంచాయతీలలో వేసవికాలం పూర్తయ్యేంతవరకు చలివేంద్రాలను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఎంపీడీవో అన్నం పురుషోత్తం తెలిపారు.

# అన్నారంను స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యం:

**గ్రామ సర్పంచ్ బండి పృథ్వీరాజ్**



**కేసముద్రం, మార్చి 26(నంది పత్రిక):**కేసముద్రం మండలం లోని అన్నారం గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని గ్రామ సర్పంచ్ బండి పృథ్వీరాజ్ అన్నారు. గురువారం గ్రామంలోని సైడ్ కాల్వలలో నిండిపోయిన మట్టిని గ్రామ పంచాయతి సిబ్బందిచే దగ్గరుండి తీయిస్తూ శుభ్రం చేయిస్తున్నారు. గ్రామంలో కొన్ని సైడ్ కాల్వల నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో కూలి పోయాయని, మరికొన్ని శుభ్ర చేయకపోవడంతో పూర్తిగా చెత్త చెదారంతో నిండిపోయాయని తెలిపారు. కూలిపోయిన వాటి నిర్మాణం చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు. గ్రామాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దడంలో గ్రామస్తులు కూడా సహకరించాలని గ్రామ ప్రజలను కోరారు. ఎవరికీ వారు తమ పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.



# ఈవీఎంల గోడౌన్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప, బ్యూరో చీఫ్ మార్చి 26 నంది పత్రిక** గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ భవన సముదాయంలోని ఈవీఎం గోడౌన్లను గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు త్రైమాసిక తనిఖీల్లో భాగంగా.. ఈవీఎంలను భద్రపరిచిన గోడౌన్లను తనిఖీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి వెంకటపతి, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ ఈ. శ్రీకాంత్ రెడ్డి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు లక్ష్మణ్ రావు(బిజెపి), జనార్దన్, జబీవుల్లా (తెదేపా), గౌస్ పీర్ (కాంగ్రెస్), ఫయాజ్ అహ్మద్(వైసిపి) డా.శ్రీనివాసులు (ఆప్), విశ్వనాథ్ (జేఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.



# జాతీయస్థాయి దివ్యాంగ క్రీడా విజేతకు సత్కారం

**షాట్ పుట్ లో జాతీయస్థాయిలో రజత (సిల్వర్ మెడల్) పతకం సాధించిన గౌతమ్**

**అంతర్జాతీయ పోటీలలో పాల్గొనడానికి జాతీయ స్థాయి కోచింగ్ కు ఎంపికైన గౌతమ్**

**సత్కరించిన నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్**

**దివ్యాంగ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం: డాక్టర్ రవి కృష్ణ**

**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 26 ( నంది పత్రిక )** ఈనెల 18వ తేదీ నుండి 21వ తేదీ భువనేశ్వర్ లో ఉన్న కళింగ స్టేడియంలో జరిగిన 24వ జాతీయ పారా అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర తరపున పాల్గొన్న నంద్యాల జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన గౌతమ్ షాట్ పుట్ క్రీడా విభాగంలో సిల్వర్ మెడల్ (రజత పతకం) సాధించిన సందర్భంగా గురువారం స్థానిక నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో, నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గౌతమ్ ను శాలువా, బహుమతులతో ఘనంగా సత్కరించారు. నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొని గౌతమ్ ను అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవికృష్ణ, సోమేశుల నాగరాజు మాట్లాడుతూ నంద్యాల జిల్లాకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు గౌతమ్ గత నెల నెల్లూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున పాల్గొని రజత పతకం సాధించడం ప్రశంసనీయమన్నారు. అంతర్జాతీయ పోటీలలో దేశం తరఫున పాల్గొనడానికి బెంగళూరులో ఉన్నతస్థాయి శిక్షణ కోసం గౌతమ్ ఎంపిక కావడం విశేషం అన్నారు. గౌతమ్ అంతర్జాతీయ దివ్యాంగ క్రీడలలో దేశానికి పతకం సాధించి భారత దేశానికి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి, నంద్యాల జిల్లాకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ సహకారం భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామన్నారు. క్రీడలలో ఆసక్తి ఉన్న దివ్యాంగులు దివ్యాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సంప్రదిస్తే తగిన విధంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు సోమేసుల నాగరాజు, లయన్స్ క్లబ్ ప్రాంతీయ చైర్మన్ సుధాకర రెడ్డి, నంద్యాల జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, జిల్లా పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణయ్య, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్, నంద్యాల జిల్లా టీవీ టెక్నీషియన్ అసోసియేషన్ అధ్యక్షులు కన్నయ్య, సీనియర్ లయన్స్ క్లబ్ సభ్యులు మేడం చంద్రశేఖర్, కార్యాలయ కార్యదర్శి ఆలా మధు పాల్గొన్నారు.



# జనగణన-2027 ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా నియమ నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**

**కర్నూలు, నంది పత్రిక.....**జనగణన–2027 ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా నియమ నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం జనగణన2027 తొలి దశలో నిర్వహించనున్న గృహ జాబితా మరియు గృహ జనగణన కార్యక్రమాల అమలుకు సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ మరియు సంబంధిత అధికారులకు కర్నూలులోని జి. పుల్లయ్య ఇంజినీరింగ్ & టెక్నాలజీ కళాశాలలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... శిక్షణలో బోధించిన ప్రతి అంశాన్ని స్పష్టంగా అర్థం చేసుకొని, ఎటువంటి సందేహాలు ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు ఎంత ప్రాధాన్యం ఉంటుందో, అదే స్థాయిలో జనగణన ప్రక్రియకు కూడా ప్రాముఖ్యత ఉందని, సంబంధిత అధికారులు పూర్తి శ్రద్ధతో పనిచేయాలని తెలిపారు. ముందుగా హౌస్ మ్యాపింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని ఖచ్చితంగా గుర్తించి, ఎటువంటి పొరపాట్లు లేకుండా మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. హ్యాండ్స్–ఆన్ ట్రైనింగ్ ద్వారా పొందిన అనుభవాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫీల్డ్ ట్రైనర్స్‌గా ఉన్న ఉపాధ్యాయులు తమ కింద పనిచేసే ఎన్యూమరేటర్లకు సమగ్ర శిక్షణ అందించి, ఫీల్డ్ స్థాయిలో కచ్చితంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇక నమోదు చేసిన ప్రతి వివరాన్ని పైస్థాయిలో రీ–చెక్ చేసే విధానం ఉంటుందని, అందువల్ల ఎటువంటి పొరపాట్లకు అవకాశం లేకుండా పూర్తి ఖచ్చితత్వంతో డేటా నమోదు చేయాలని తెలిపారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ, సెన్సెస్ అధికారి దీపక్ భరద్వాజ్ తదితరులు పాల్గొన్నారు.



# నూతన తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు పోరుమామిళ్ల డీలర్ల ఘన సన్మానం

**పోరుమామిళ్ల మార్చి 26( నంది పత్రిక )**పోరుమామిళ్ల మండలానికి బదిలీపై విచ్చేసిన నూతన తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు మండలంలోని రేషన్ డీలర్లు ఆత్మీయ స్వాగతం పలుకుతూ ఘనంగా సన్మానించారు. స్థానికంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీలర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో గౌరవించి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సేవలు వేగవంతంగా అందించడంలో తహసిల్దార్ కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా పౌర సరఫరాల వ్యవస్థలో పారదర్శకత, సమర్థవంతమైన పంపిణీ కొనసాగేందుకు తహసిల్దార్ మార్గదర్శకత్వం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు సక్రమంగా చేరేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

తహసిల్దార్ ఉదయ భాస్కర్ రాజు స్పందిస్తూ, ప్రజల సమస్యల పరిష్కారం తన ప్రాధాన్యమని, అధికారులుడీలర్లు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ సన్మాన కార్యక్రమం సౌహార్ద వాతావరణంలో, పరస్పర విశ్వాసాన్ని ప్రతిబింబిస్తూ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్ రెడ్డి,ప్రెసిడెంట్ సగిలి గురప్ప, మస్తాన్, అల్లూరయ్య, నాగ సుబ్బయ్య, ఎం ప్రసాద్, మాబు, సావిత్రి, కరిష్మా, జయసుధ, బి ప్రసాద్, రవి, సాగర్, రాజగోపాల్, మౌలాలి, కొండయ్య, కే శ్రీనివాసులు, బి సురేష్, సుబ్బయ్య, లక్ష్మీ రావు. దాదాపు 34 మంది డీలర్లు పాల్గొన్నారు.



# ముగ్గురి పై జిల్లా బహిష్కరణ..

**ఇప్పటివరకు 8 మంది జిల్లా బహిష్కరణ .**

**కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ఆా. సిరి ఐఏఎస్ .**

**కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ .**

**కర్నూలు నంది పత్రిక......** జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతున్న ముగ్గురు వ్యక్తులపై జిల్లా బహిష్కరణ చర్యలు తీసుకున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆా. సిరి ఐఏఎస్ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా బహిష్కరణకు గురైన ఈ ముగ్గురు వ్యక్తులు కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్నూలు మండలం, పి. రుద్రవరం గ్రామంకు చెందిన వారు.

1) మిట్టగేరి కుర్వ వెంకటేశ్వర్లు 2) కుర్వ మధు ఏ పుండుకూర మధు 3) మిట్టగేరి కుర్వ మధసూధన్ ఏమధు

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండడంతో ఈ ముగ్గురి పై కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఆా. సిరి ఐఏఎస్ గారు గురువారం జిల్లా బహిష్కరణ ఉత్తర్వులను జారీ చేయడం జరిగింది. కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్ లో మిట్టగేరి కుర్వ వెంకటేశ్వర్లు పై రౌడీషీట్ నెంబర్ 140 ఉంది.

**కుర్వ మధు పై రౌడీషీట్ నెంబర్ 141 ఉంది.** క్రిమినల్ కేసులలో నిందితులుగా ఉన్నారు. ఈ పై వ్యక్తులు గతంలో తీవ్రమైన నేరాలకు, ముఖ్యంగా హత్యలకు సంబంధించిన కేసుల్లో పాల్గొన్నట్లు గుర్తించినందున , ప్రజల్లో భయాందోళనలు సృష్టించే అవకాశం ఉన్న నేపథ్యంలో చట్టపరమైన నిబంధనల ప్రకారం జిల్లా బహిష్కరణ విధించినట్లు తెలిపారు. పై తెలిపిన కేసుల్లో పలు మార్లు రిమాండ్ కు వెళ్లినప్పటికీ కూడా వీరి ప్రవర్తనలో ఎటువంటిమార్పు రాకపోగా, మరి ఎక్కువగా వివిధ రకాల కేసులలో పాల్గొంటున్నారని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపిఎస్ యొక్క ప్రతిపాదనల మేరకు వీరి యొక్క క్రిమినల్ రికార్డులను నిశితంగా పరిశీలించిన మీదట జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఐఏఎస్ ఈ రోజున ముగ్గురి పై జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ మాట్లాడుతూ...జిల్లాలో ఇప్పటివరకు చెడు నడత కలిగిన










**ఎనిమిది మంది పై** 1)వడ్డే రామాంజనేయులు
2) పటాన్ ఇమ్రాన్ ఖాన్ 3) వడ్డే తులసి కుమార్
4) వడ్డే రేవంత్ కుమార్ 5) వడ్డే శివ కుమార్
6) మిట్టగేరి కుర్వ వెంకటేశ్వర్లు 7) కుర్వ మధు ఏ పుండుకూర మధు 8) మిట్టగేరి కుర్వ మధసూధన్ ఏమధు జిల్లా బహిష్కరణ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు.జిల్లాలో శాంతి భద్రతలకు భంగం కలుగజేసే వారి పై ఇలాంటి చర్యలు కొనసాగుతాయని, అరాచక శక్తులుగా మారి , ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలుగ జేసే విధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారి పై జిల్లా బహిష్కరణతో పాటు గా పీడి యాక్ట్ నమోదు చేసి జైలుకు తరలించడం జరుగుతుందని, ప్రశాంతంగా, మంచిగా, బుద్ధిగా జీవించాలని జిల్లా ఎస్పీ కోరారు.ఇటువంటి చెడు నడత కలిగిన చాలామంది పేర్లు జిల్లా బహిష్కరణ పరిశీలనలో ఉన్నాయని, మంచి ప్రవర్తనతో జీవించాలని కర్నూల్ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ హెచ్చరించారు.





# ఉత్తరాంధ్రకు ‘ఉక్కు‘ భరోసా..

**ఏపీ ప్రగతి పథంలో మరో మైలురాయి!**

**అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ - నిప్పన్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన**

**1.35 లక్షల కోట్ల పెట్టుబడి.. లక్ష మందికి ఉపాధి అవకాశాలు**



**కర్నూలు నంది పత్రిక......** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక చరిత్రలో సరికొత్త అధ్యాయం మొదలైంది. ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చే విధంగా అనకాపల్లి జిల్లాలో ప్రపంచస్థాయి సమీకృత ఉక్కు కర్మాగారానికి సోమవారం నాడు శంకుస్థాపన జరిగింది. ఆర్సెలర్ మిట్టల్ మరియు నిప్పన్ స్టీల్ (ఆవీచీూ) సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ఈ భారీ ప్రాజెక్టుకు కేంద్రమంత్రి కుమారస్వామి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఘనంగా శంకుస్థాపన చేశారు.దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టు సుమారు 1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్టులలో ఒకటిగా ఇది నిలవనుంది. కేవలం ఒక పరిశ్రమగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ యువత భవిష్యత్తును మార్చే ‘ఉపాధి యంత్రం‘గా దీనిని అభివర్ణిస్తున్నారు.

**ప్రాజెక్టు ముఖ్యాంశాలు:** భారీ ఉపాధి: ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి.రెండు దశల్లో నిర్మాణం: 5,465 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్ రెండు దశల్లో పూర్తి కానుంది. మొదటి దశలో ఏటా 7.3 మిలియన్ టన్నుల (మీూూ) ఉక్కు ఉత్పత్తి జరగగా, రెండో దశ పూర్తయ్యే సరికి అది 10.5 మీూూకి చేరుకుంటుంది. పోర్ట్ కనెక్టివిటీ: స్టీల్ ప్లాంట్‌తో పాటు 50 మీూూ సామర్థ్యంతో ప్రత్యేక ‘క్యాప్టివ్ పోర్ట్‘ను కూడా నిర్మించనున్నారు. మౌలిక వసతులు: ₹11,192 కోట్లతో జాతీయ రహదారుల అనుసంధానం మరియు నాలుగు వరుసల రహదారి నిర్మాణం కూడా చేపట్టనున్నారు.

**కూటమి ప్రభుత్వ ‘స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‘**ప్రపంచ స్థాయి కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయంటే అది ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న విశ్వసనీయతకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో తక్కువ సమయంలోనే క్లియరెన్సులు పూర్తి చేసి, ఈ మెగా ప్రాజెక్టును పట్టాలెక్కించారు. “జీశీఎం ఖీఱతీర్“ విజన్‌తో స్థానిక యువతకు భారీ స్థాయిలో ఉపాధి కల్పించడమే లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**ఆర్థిక రాజధానిగా విశాఖ..** ఈ ప్రాజెక్టు రాకతో ఉత్తరాంధ్ర పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందడమే కాకుండా, రాష్ట్ర జీడీపీ (+ఎూ) వృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్ అందుబాటులోకి రానుండటంతో, విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా మరింత పటిష్టం కానుంది. ఈ ప్రాజెక్టు పట్ల ప్రధాని నరేంద్ర మోదీ సైతం హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతమ్మ, రాఘవేంద్ర, పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహన చోదకులకు పొంచి ఉన్న ‘బ్రాకియల్ ప్లెక్సస్‘ ముప్పు!

**చేయి పడిపోతే కుంగిపోవద్దు..**

**అత్యాధునిక ‘మైక్రో సర్జరీ‘తో పునర్జీవం**

**కర్నూలు నంది పత్రిక......** నేటి వేగవంతమైన ప్రపంచంలో బైక్ ప్రమాదాలు ఎందరో యువత జీవితాల్లో చీకట్లు నింపుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు దక్కినా, చేయి పడిపోయి (పక్షవాతంలా) జీవితాంతం అశక్తులుగా మారుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీనికి ప్రధాన కారణం మెడ నుంచి చేతికి వెళ్లే ‘బ్రాకియల్ ప్లెక్సస్‘ నరాలు దెబ్బతినడమే. ఈ తీవ్రమైన సమస్యపై అవగాహన కల్పించేందుకు యశోద హాస్పిటల్స్ (హైటెక్ సిటీ) ప్రముఖ ప్లాస్టిక్ అండ్ రికన్స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ పి. ప్రకాష్ గురువారం యశోద హాస్పిటల్ ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

**ఏమిటీ బ్రాకియల్ ప్లెక్సస్ ఇంజూరీ?** మన మెడ భాగం నుంచి చేతి చివర వరకు కదలికలను, స్పర్శను అందించే నరాల సమూహాన్ని ‘బ్రాకియల్ ప్లెక్సస్‘ అంటారు. బైక్ పై నుంచి పడిపోయినప్పుడు మెడ, భుజం మధ్య భాగం తీవ్రంగా లాగబడటం వల్ల ఈ నరాలు తెగిపోవడం లేదా నలిగిపోవడం జరుగుతుంది. ఫలితంగా భుజం నుంచి చేయి వరకు పూర్తిగా కదలికలు కోల్పోవడం.

**చేతిలో స్పర్శ లేకపోవడం, చేయి మొద్దుబారిపోవడం.**
రోజువారీ పనులు చేసుకోలేక ఇతరులపై ఆధారపడటం.

నిర్లక్ష్యం వద్దు.. ఫిజియోథెరపీయే పరిష్కారం కాదు!

చాలామంది బాధితులు చేయి పడిపోగానే కేవలం ఫిజియోథెరపీతోనే నయమవుతుందని భావించి విలువైన కాలాన్ని వృథా చేస్తున్నారని డాక్టర్ ప్రకాష్ హెచ్చరించారు. “నరాలు తీవ్రంగా దెబ్బతిన్నప్పుడు (ంఎజూవ 3, 4, 5 ఇంజూరీస్) కేవలం వ్యాయామంతో నరం తిరిగి అతుక్కోదు. దీనికి సర్జరీయే ఏకైక మార్గం. ఆరు నెలల నుంచి తొమ్మిది నెలల లోపు శస్త్రచికిత్స చేయించుకుంటే కోలుకునే అవకాశాలు 90% పైగా ఉంటాయి. ఏడాది దాటితే ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండవు,“ అని ఆయన స్పష్టం చేశారు.వరంలా మారిన ‘మైక్రో సర్జరీ వైద్యరంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల ఇప్పుడు పడిపోయిన చేతికి తిరిగి ప్రాణం పోయవచ్చని డాక్టర్ వివరించారు.నరాల మార్పిడి శరీరంలోని ఇతర పనికిరాని నరాలను లేదా పక్కనే ఉన్న ఆరోగ్యకరమైన నరాలను తీసుకుని దెబ్బతిన్న చోట అమర్చడం ద్వారా చేతికి తిరిగి కదలికలు తీసుకురావచ్చు.కండరాల మార్పిడి అవసరమైతే కండరాలను మార్చడం ద్వారా చేతి పట్టును తిరిగి సాధించవచ్చు త్వరితగతిన రికవరీ: సర్జరీ తర్వాత నిపుణుల పర్యవేక్షణలో ఉండే వ్యాయామాల ద్వారా బాధితులు తిరిగి తమ వృత్తి పనుల్లో నిమగ్నం కావొచ్చు.




“బాధితుల్లో భరోసా నింపడమే మా లక్ష్యం. సరైన సమయంలో, సరైన సర్జన్ వద్ద చికిత్స పొందితే వైకల్యం నుంచి విముక్తి పొందవచ్చు.“

**డాక్టర్ పి. ప్రకాష్, బ్రాకియల్ ప్లెక్సస్ సర్జన్.**

**జాగ్రత్తలు ఇవే..**

అతివేగం వద్దు, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి.

ప్రమాదం జరిగిన వెంటనే చేతిలో స్పర్శ లేకపోయినా, కదలిక తగ్గినా వెంటనే నిపుణులైన ‘బ్రాకియల్ ప్లెక్సస్ సర్జన్‘ను సంప్రదించాలి. ఎముకల డాక్టర్‌తో పాటు నరాల పనితీరును కూడా పరీక్షించుకోవడం ముఖ్యం. సందేశం: వైకల్యం శాపం కాదు.. సకాలంలో చేసే వైద్యం ఒక వరం.

# అగ్గిపెట్టె మీద సూక్ష్మ చిత్రాలతో రామాయణం

**నంద్యాల ప్రతినిధి. మార్చి 26 . (నంది పత్రిక ):**నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్రకారుడు కళారత్న చింతలపల్లె కోటేష్ శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని చిన్న అగ్గిపెట్టె మీద మైక్రో పెన్నుతో, మైక్రోబ్రష్ లతో వాటర్ కలర్స్ పెయింటింగ్స్ తో మూడు గంటల సమయంలోనే రామాయణం లోని ప్రధాన ఘట్టాలు వేసారు.కేవలం రెండు ఇంచెస్ పొడవు, రెండున్నర ఇంచెస్ వెడల్పు గల అగ్గిపెట్టె పై (ఇంచెస్ అంటే అంగుళాలు)ఆయన ఉహాలో మె దిలే రామాయణం లోని ప్రధాన అంశాలు వేసానని తెలిపారు.ఈ సందర్భంగా కోటేష్ మాట్లాడుతూ నేను వేసిన ఈ చిత్రం లో శ్రీరాముని జననం నుండి సీతా దేవి అగ్ని పరీక్ష వరకు వుంటుంది. సాక్షాత్ శ్రీ మహావిష్ణువే త్రేత యుగంలో శ్రీరాముడిగా దశరథ మహారాజుకు, కౌసల్య కు జన్మించారు. శ్రీరాముడు సత్యవంతుడు, దయామయుడు, పురు షోత్తముడు, పరాక్రమవంతుడు, ఆదర్శ ప్రాయుడు, పితృ వాక్యపరిపాలకుడు. తండ్రి మాట కోసం 14 ఏళ్ళు వనవాసం చేసిన ఆదర్శ కుమారుడు. ఏకపత్ని వ్రతుడు. సోదరులను ఎంతో ఆప్యాయంగా చూసుకునేవాడు. ప్రజలను కన్న బిడ్డలాగ చూసుకునేవారు.శ్రీరామచంద్రుడు ధర్మ మార్గాన్ని ఆచరిస్తారు కాబట్టి అందరికి ఆదర్శప్రాయుడు. అందుకే రామాయణం గురించి ఎన్ని సార్లు విన్న, రామాయణం గురించి ఎన్ని సార్లు బొమ్మలు వేసిన తనివి తీరదు.నేను వేసిన ఈ చిత్రం లో దశరథ మహారాజుకు ముగ్గురు భార్యలు కౌసల్య, సుమిత్ర, కైకేయి వారు తమ పిల్లలైన రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులను ముద్దాడు తున్నట్లు, రామ, లక్ష్మణులు విశ్వామిత్రుని దగ్గర శిష్యరికంలో వున్నట్లు, యజ్ఞం భంగం చేస్తున్న రాక్షసులను రామలక్ష్మణులు సంహరిస్తున్నట్లు, అహల్య శాప విమోచన, రాముడు శివ ధనుస్సు విరిచినట్లు,సీతారాముల కళ్యాణం, తండ్రి దగ్గర సెలవు తీసుకొని వనవాసం వెళుతున్న రామ, లక్ష్మణ, సీతమ్మ, రాముని పాదరక్షలు తీసుకుంటున్న భరతుడు, రామునికి జింకను చూపిస్తున్న సీతమ్మ, మారు వేషంలో రావణుడు, సీతాదేవిని అపహరించి పోతున్నప్పుడు సీతమ్మ కాపాడుట కోసం జటాయువు అనే పక్షి అడ్డం వస్తే దాన్ని రెక్కలు రావణుడు నరుకుతున్నట్లు, రామునికి ప్రేమతో పళ్ళు తినిపిస్తున్న శబరి,వాలి సంహారం, సీతమ్మ జాడ కోసం హనుమంతుడు ఆకాశంలో పోతున్నట్లు, సీతా దేవి ఇచ్చిన చూడామణిని హనుమ తీసుకున్నట్లు, లంకా దహనం, కుంభకర్ణుడు, ఇంద్రజిత్తులతో యుద్ధం చేస్తున్న రామలక్ష్మణులు, యుద్ధంలో మూర్ఛ పోయిన లక్ష్మణుడు, సంజీవ పర్వతం తెస్తున్న హనుమాన్, రామ రావణ యుద్ధంలో రావణుడి సంహారం, అగ్ని పరీక్షలో మహా సాధ్వి సీతమ్మ వున్నట్లు ఇలా ఇన్ని ప్రధాన ఘట్టాలను చిన్న అగ్గిపెట్టె పై వేసాను. శ్రీరాముని మీద వున్నా భక్తితో ఈ చిత్రం వేసాను. భక్తులందరికి ఆ రామయ్య ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాను. అందరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు. జై శ్రీరామ్... జై జై శ్రీరామ్.





# ఘన వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలి







**నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్**

**బయో మైనింగ్ వీలైనంత త్వరగా పూర్తి చేయాలి**

**స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకు మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళిక**

**తడి, పొడి చెత్తా వేర్వేరుగా సేకరించాలి**

**కర్నూలు నంది పత్రిక.....** నగరంలో ఉత్పత్తి అవుతున్న చెత్తను (ఘన వ్యర్థాలను) శాస్త్రీయ విధానాలతో సమగ్రంగా నిర్వహించేందుకు సేకరణ, వర్గీకరణ, ప్రాసెసింగ్, రీసైక్లింగ్, శానిటరీ ల్యాండ్‌ఫిల్లింగ్ వంటి ప్రక్రియలను సమర్థవంతంగా అమలు చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. గురువారం ఆయన గార్గేయపురం డంప్‌యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఘన వ్యర్థాల నిర్వహణలో భాగంగా మొదటిగా మూల స్థాయిలోనే (సోర్స్ సెగ్రిగేషన్) తడి, పొడి, హానికర వ్యర్థాలను వేర్వేరుగా విభజించడం అత్యవసరమని తెలిపారు. తదుపరి డోర్ టు డోర్ కలెక్షన్ విధానాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి, సేకరించిన చెత్తను మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ (ఎంఆర్ఎఫ్) సెంటర్‌కు తరలించి, రీసైక్లబుల్, నాన్ రీసైక్లబుల్ వ్యర్థాలుగా వర్గీకరించాలన్నారు. తడి వ్యర్థాలను విండో కంపోస్టింగ్, వర్మి కంపోస్టింగ్ విధానాల ద్వారా సేంద్రీయ ఎరువులుగా మార్పిడి చేయడం, ఇన్‌ఓర్గానిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ యూనిట్లకు పంపించడం చేపట్టాలన్నారు. డంప్‌యార్డులో పేరుకుపోయిన పాత చెత్తను బయో మైనింగ్, బయో రిమిడియేషన్ సాంకేతికతల ద్వారా శాస్త్రీయంగా శుద్ధి చేసి, వినియోగయోగ్యమైన భూమిని తిరిగి పొందాలని ఆదేశించారు. చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి (వెస్ట్ టు ఎనర్జీ) ప్రాజెక్ట్‌ను వేగవంతం చేసి, 15 ఎకరాల్లో చేపట్టిన బయో మైనింగ్ పనులను రోజువారీ లక్ష్యాలతో యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకు మెరుగుదలకు డేటా మేనేజ్‌మెంట్, డోర్ టు డోర్ కవరేజ్, శానిటేషన్ పనుల మానిటరింగ్‌పై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ఎంఆర్ఎఫ్ ప్లాంట్‌తో పాటు డంప్ యార్డులో జరిగే ప్రతి ప్రక్రియకు లాగ్‌బుక్స్ నిర్వహించాలని స్పష్టం చేశారు. వర్మి కంపోస్టింగ్ ద్వారా ఉత్పత్తి అయ్యే ఎరువుల నిల్వ, పంపిణీ, విక్రయాలపై ప్రత్యేక రిజిస్టర్లు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన శానిటేషన్ ఇంస్పెక్టర్ యువరాజుకు షోకాజ్ నోటీస్ ఇవ్వాలని తెలిపారు.కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజు, డిఈఈ పవన్, శానిటేషన్ ఇంస్పెక్టర్ లోకేష్, స్వచ్ఛ సర్వేక్షన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి ఎస్ఐహెచ్ఎం సిబ్బంది వేతన కష్టాలకు తెర

తిరుపతి స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఐహెచ్ఎం) సిబ్బంది వేతన కష్టాలకు తెరపడింది. పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్(వీఱఅఱర్‌వతీ ఖుఅఎబశ్రీఖ ణబతీస్త్రవంష్ట్ర) చొరవతో రూ.84 లక్షల బకాయి వేతనాలు విడుదలయ్యాయి. గత ప్రభుత్వ వైఖరి కారణంగా గత 22 నెలలుగా జీతాలు నిలిచిపోయి సిబ్బంది తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితి. ఈ సమస్య పరిష్కారం కోసం మంత్రి కందుల దుర్గేశ్‌తో పాటు కూటమి ప్రభుత్వం త్వరితగతిన చర్యలు చేపట్టడంతో ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో ఇంటర్ సెకండియర్ సిలబస్ లీక్.. రంగంలోకి సైబర్ క్రైమ్ పో సచివాలయంలో మంత్రి దుర్గేశ్‌ను టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి, త్వరితగతిన నిధులు విడుదల చేయడానికి కృషి చేసినందుకు కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు సిబ్బంది ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



# వంట గ్యాస్, పెట్రోల్ కు ఎటువంటి కొరతా లేదు.. ప్రజలెవ్వరూ ఆందోళన చెందవద్దు

**ప్రజల అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నాయి**

**వంట గ్యాస్ సరఫరాపై గట్టి నిఘా పెట్టాలి బ్లాక్ మార్కెట్ కు తరలించే వారిపై కేసులు నమోదు చేయండి**

**పీఎన్ జి గ్యాస్ వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కలిగించాలి**

**నిత్యాన్నదానం నిర్వహించే దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు పి ఎన్ జి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి**

**జిల్లాలో గ్యాస్, పెట్రోల్ సరఫరాపై అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష**

**ఏలూరు,బ్యూరో చీఫ్ మార్చి , 26 :నంది పత్రిక** జిల్లాలో వంట గ్యాస్, పెట్రోల్ కు ఎటువంటి కొరతా లేదని ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. స్థానిక కలెక్టరేట్ లో గురువారం జిల్లాలో గ్యాస్, పెట్రోల్ సరఫరాపై అధికారులు, ఆయిల్ కంపెనీల ప్రతినిధులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి కొరతా లేదని, ప్రజల భవిష్యత్తు అవసరాలకు కూడా సరిపడా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. జిల్లాలో గృహ వినియోగదారులకు సంబంధించి వంట గ్యాస్ రోజుకు సగటున 10 వేల వరకు బుకింగ్స్ నమోదవుతున్నాయని, వాటికి నిర్ణయించిన సమయంలోగా అందిస్తున్నామన్నారు. అదేవిధంగా పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయన్నారు. గ్యాస్ బుక్ చేసుకున్నవారికి ఎక్కువ రోజులు వేచిఉండకుండా నిర్ణీత సమయంలోగా గ్యాస్ సరఫరా చేసేలా గ్యాస్ ఏజెన్సీస్ చర్యలు తీసుకోవాలన్నారు. పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ చాలా తక్కువ ఖర్చుతోనే ఏర్పాటు చేసుకోవచ్చని, జిల్లాలో పైపు లైన్ ద్వారా నాచురల్ గ్యాస్ సరఫరా పై ప్రజలకు విస్తృతమైన అవగాహన కలిగించి గృహ, వాణిజ్య అవసరాలకు పి ఎన్ జి గ్యాస్ కనెక్షన్ల ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నిత్యాన్నదానం నిర్వహించే దేవాలయాలు, సంక్షేమ వసతి గృహాలకు గ్యాస్ కొరత లేకుండా చూడాలని, పి .ఎన్ .జి. గ్యాస్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొంతమంది దురుద్దేశ్యపూర్వకంగా సోషల్ మీడియా ద్వారా గ్యాస్, పెట్రోల్ కొరత ఉందని వదంతులను వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని, అవసరానికి మించి గ్యాస్, ఆయిల్ కొనుగోలు చేసి నిల్వ ఉంచుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ కొరత ఉన్నదంటూ వదంతులు వ్యాప్తి చేసేవారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుత సమయంలో గృహ వినియోగ గ్యాస్ వాణిజ్య అవసరాలకు మరలకుండా పటిష్టమైన నిఘా పెట్టాలని, బ్లాక్ మార్కెట్ చేసే ఏజెన్సీలపై కేసులు నమోదు చేయాలన్నారు. పెట్రోల్, డీజిల్ కూడా ప్రజల అవసరాల మేరకు నిల్వలు ఉన్నాయని, ఎటువంటి ఆందోళనకు గురికావద్దని ప్రజలకు అధికారులు తెలియజేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి. విలియమ్స్, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామమూర్తి, ఇండియన్ ఆయిల్, భారత్ , హిందూస్తాన్ పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు మహేష్, సందీప్, సూర్య, గ్యాస్ ఏజెన్సీస్ అసోసియేషన్ ప్రతినిధి బ్రహ్మానందం, పెట్రోల్ బంక్ యాజమాన్యాల అసోసియేషన్ ప్రతినిధి స్వర్ణ శేఖర్, పి ఎన్ జి ఏజెన్సీలకు సంబంధించి గోదావరి గ్యాస్ పైప్ లైన్ , మేఘా గ్యాస్ పైప్ లైన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.




# మైనర్ బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నివారణకు సంబంధించి చట్టాలపై సమగ్ర అవగాహన కల్పించడం అత్యంత అవసరం

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు.**







**భీమవరం బ్యూరో చీఫ్ మర్చి 26 నంది పత్రిక** మహిళల భద్రతను కాపాడటంలో చట్టాలపై అవగాహన కీలక పాత్ర పోషిస్తుందని ఆమె తెలిపారు. గురువారం భీమవరం కలెక్టర్ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో "పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం2013" నివారణ, నిషేధం, దిద్దుబాటు అంశాలపై జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమాన్ని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ వర్క్‌షాప్‌లో పోలీస్, రెవెన్యూ, విద్య, కార్మిక, గృహనిర్మాణ, ఫ్యాక్టరీస్, వ్యవసాయ, డిఆర్డిఏ, డీఎంహెచ్ఓ, తదితర శాఖలకు చెందిన అధికారులు, షాపింగ్ మాల్స్ యాజమాన్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ మహిళలు సమాజంలో ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులు, దాడులను అరికట్టేందుకు చట్టాలపై పూర్తి అవగాహన కల్పించడం పోలీసు శాఖతో పాటు అన్ని విభాగాల అధికారుల బాధ్యత అని తెలిపారు. మహిళా ఉద్యోగులు తమ పని ప్రదేశాల్లో ఎటువంటి లైంగిక, శారీరక లేదా మానసిక వేధింపులకు గురైనప్పటికీ వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు ఫిర్యాదు చేయడంలో ఎలాంటి భయానికి గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం వారికి పూర్తి మద్దతు అందిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే మహిళల భద్రతకు ఆ సంస్థల యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పని ప్రదేశాల్లో 10 మంది కంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థల్లో తప్పనిసరిగా అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. బాధితులు సంఘటన జరిగిన 30 రోజుల లోపు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బాధిత మహిళ స్వయంగా ఫిర్యాదు చేయలేని పరిస్థితుల్లో ఆమె బంధువులు లేదా స్నేహితులు కూడా ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. సంస్థ వెలుపల జరిగే లైంగిక వేధింపుల కేసులను జిల్లా స్థాయి కమిటీ పరిధిలో నమోదు చేయవచ్చని, ప్రభుత్వ, ప్రైవేట్, వ్యవస్థీకృత మరియు అవ్యవస్థీకృత రంగాలు, గృహ కార్మికులు అందరికీ ఈ చట్టం వర్తిస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. చట్టాలను దుర్వినియోగం చేస్తూ తప్పుడు కేసులు నమోదు చేసే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వికలాంగులపై జరుగుతున్న దాడుల విషయంలో చట్టాలను కచ్చితంగా అమలు చేస్తామని, నిందితులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆమె తెలిపారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ … ప్రతి ఒక్క మహిళ అవగాహన కలిగి ఉండాలి

మహిళలు తమ భద్రత కోసం మొబైల్ ఫోన్లలో "శక్తి యాప్" తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా మహిళల ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి, కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సేవల పనితీరును పరిశీలించారు.జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి మరియు సాధికారత అధికారిణి డి.లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం ముఖ్య ఉద్దేశ్యం నేరాల నివారణ, నిషేధం మరియు బాధితులకు న్యాయం కల్పించడం అని తెలిపారు. కార్యాలయాలు, కర్మాగారాలు, స్వయం ఉపాధి రంగాలలో పనిచేసే మహిళలకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుందని ఆమె పేర్కొన్నారు. భీమవరంలో వన్ స్టాప్ సెంటర్ ద్వారా మహిళలకు అత్యవసర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా లీడర్ సర్వీసెస్ అథారిటీ ప్యానల్ న్యాయవాదులు సత్య విజ్ఞాన దేవి, అడ్వకేట్ సుజాత, పోలీస్ ఇన్స్పెక్టర్ ఎండి. అహ్మద్ ఉన్నిసా, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# దానాలలో రక్తదానం గొప్పది






**రక్తదానం చేయండి ప్రాణాలను కాపాడండి జిల్లా జాయింట్ కలెక్టర్ టీ రాహుల్ కుమార్ రెడ్డి**

**భీమవరం:బ్యూరోచీఫ్ మార్చి 26, నంది పత్రిక** ప్రమాదాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో రోగులకు తక్షణం రక్తం అందించడం ద్వారా అనేక విలువైన ప్రాణాలను కాపాడవచ్చని జాయింట్ కలెక్టర్ శ్రీ టి. రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. రక్తదానం సమాజానికి అత్యంత అవసరమైన మానవతా సేవగా భావించాలని ఆయన సూచించారు. భీమవరం పట్టణంలోని రాయలంలో ఉన్న జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయంలో గురువారం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జాయింట్ కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాలు అత్యవసర సమయాల్లో రోగులకు ప్రాణ రక్షణగా నిలుస్తున్నాయని అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ ఆధ్వర్యంలో కాళ్ల మండలానికి చెందిన ఉపాధ్యాయులు స్వచ్ఛందంగా పాల్గొని, మొత్తం 25 మంది రక్తదానం చేశారు. ఈ సేవాభావాన్ని అభినందించిన జాయింట్ కలెక్టర్, రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ స్వయంగా రక్తదానం చేసి ఇతరులకు ఆదర్శంగా నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఈ నెలలో విద్యాశాఖ ద్వారా 600 యూనిట్ల రక్త సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉపాధ్యాయులు మరియు విద్యా సిబ్బంది చురుకుగా ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, పశ్చిమ గోదావరి జిల్లా శాఖ అందిస్తున్న సేవలను జాయింట్ కలెక్టర్ ప్రశంసించారు. సమాజానికి అవసరమైన సేవలను విస్తరించేందుకు రెడ్ క్రాస్ మరింత కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

**మొబైల్ మెడికల్ యూనిట్ పరిశీలన** అనంతరం జాయింట్ కలెక్టర్ ఇటీవల ప్రారంభించిన రెడ్ క్రాస్ "మీ ఇంటికి మీ డాక్టర్" మొబైల్ మెడికల్ యూనిట్‌ను పరిశీలించారు. ఈ యూనిట్ ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ స్వయంగా మొబైల్ యూనిట్‌లో ఆరోగ్య పరీక్ష చేయించుకుని, గ్రామీణ మరియు పట్టణ పరిసరాల్లో నివసించే ప్రజలకు ఈ సేవలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో రెడ్ క్రాస్ అందిస్తున్న మానవతా సేవలను ప్రశంసిస్తూ, ఈ సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఇ.నారాయణ, కాళ్ల మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ డా. ఎం.ఎస్.వి.ఎస్. బద్రిరాజు, రెడ్ క్రాస్ కార్యాలయ సిబ్బంది, మొబైల్ మెడికల్ యూనిట్ డాక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



# పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలి:ఎస్ఐ క్రాంతికిరణ్

**కేసముద్రం, మార్చి 26(నంది పత్రిక):**ఏళ్ల తరబడి పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి మార్చి 28న మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని కేసముద్రం ఎస్ఐ క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. గురువారం ఎస్ఐ మాట్లాడుతూ కేసముద్రం మండలంలోని పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ నుంచి అవకాశమని, దీంతో కోర్టుల చుట్టూ తిరిగే సమయం ఆదా అవడంతో పాటు అనవసర ఖర్చులు లేకుండా, సివిల్ తో పాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను కూడా ఇరువర్గాల అంగీకారంతో తక్షణ పరిష్కారం లభించి, కేసుల భారం నుండి విముక్తి పొంది ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని కోరారు.



# రాయలసీమ యూనివర్సిటీ ఖజానాను కాజేస్తున్న రిజిస్ట్రార్ ను తొలగించాలి.

**రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్రంగా విచారణ జరిపించాలి.**

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వర్సిటీకి న్యాయం చేయండి.**

**ఏఐఎస్ఎఫ్,ఏఐఎస్ఎ,పిడిఎస్ యు,ఆర్వీఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దస్తగిరికి వినతి పత్రం అందజేత.**

**రిజిస్ట్రార్ ను తొలగించేంతవరకు పోరాటాలకు కొనసాగిస్తాం.**

**కర్నూలు నంది పత్రిక.....**రాయలసీమ యూనివర్సిటీ ఖజానాను ఖాళీ చేస్తున్న రిజిస్ట్రార్ ను తక్షణమే తొలగించాలని ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి ఎస్. నాగార్జున, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.శరత్ కుమార్, పిడిఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు రమణ,ఆర్వీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజులు డిమాండ్ చేశారు. గురువారం కోడుమూరు శాసనసభ్యులు బొగ్గుల దస్తగిరి ని కలిసి, యూనివర్సిటీ పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమ యూనివర్సిటీ అవినీతికి అడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిపాలనా పేరుతో వర్సిటీకి వచ్చిన రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ప్రతి పనికి వాటా అంటూ, ప్రభుత్వం వర్సిటీ కేటాయించిన నిధులు దుర్వినియోగం చేస్తూ, వాటిని సొంత ఖాతాలకు మళ్లించుకుంటూ ధనార్జనే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీ అభివృద్ధి కొరకు కేటాయించే రూసా నిధులను కూడా కొల్లగొడుతూ, అనవసరమైన వాటికి ఉపయోగించి, కొన్ని సందర్భాల్లో జరగని పనులకు కూడా బిల్లులు చేసుకొని, సొమ్ములు చేసుకుంటున్నారని ఆరోపించారు. కాన్వకేషన్ పేరుతో కోట్లాది రూపాయలను కాజేశారని, నిబంధనల ప్రకారం కాన్వకేషన్ పేరుతో చేసిన ఖర్చులను బహిర్గతం చేయాలనేటువంటి నిబంధనను పక్కన పెట్టి, ఎలాంటి సమాచారం ఇవ్వకుండా రహస్యంగా దాచడం వెనక అనేక అనుమానాలకు తావుతీస్తుందని అన్నారు. టెండర్ల ప్రక్రియ లో కూడా అనేక అక్రమాలకు తెరలేపి, అనుకూలంగా ఉన్న వారికే కాంట్రాక్టులు ఇస్తున్నారని అన్నారు. కమిటీలలో ఆయనకు వత్తాసు పలికే వారికే ప్రాధాన్యత ఇచ్చి, ఇష్టానురాజ్యాంగ వ్యవహరిస్తున్నారని ప్రస్తుత రిజిస్ట్రార్ బాధ్యతలు చేపట్టిన తర్వాత యూనివర్సిటీ యొక్క పరువు ప్రతిష్టలను, ప్రైవేట్ వ్యక్తులు మరియు అనుబంధ కళాశాలల యాజమాన్యాలకు తాకట్టు పెట్టడం జరుగుతుందని అసహనం వ్యక్తం చేశారు. యూనివర్సిటీ యొక్క ఆత్మగౌరవం, యూనివర్సిటీ విద్యార్థుల యొక్క ఆత్మాభిమానం కు బంగం వాటిల్లే విధంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. రిజిస్ట్రార్ తీరుపై వీసీ కి పలుమార్లు ఫిర్యాదు చేసిన, ఫలితం శూన్యమని, పక్కాగా రిజిస్ట్రార్ దోపిడీకి సహకరిస్తున్నారని అన్నారు. యూనివర్సిటీలో జరుగుతున్న పరిణామాలను,పరిస్థితులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మరియు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ని కోరారు. ఈ విషయంపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, వర్సిటీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో భూపాల్,బాలాజీ, స్టీఫెన్ తదితరులు ఉన్నారు.



# మహమూద్ పట్నంలో సిసి కెమెరాల ఏర్పాటు.

**అభినందించిన ఎస్ఐ క్రాతికిరణ్**

**కేసముద్రం, మార్చి 26(నంది పత్రిక):**మహమూద్ పట్నం గ్రామంలో సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం పట్ల గ్రామస్థులను కేసముద్రం ఎస్ఐ క్రాంతికిరణ్ అభినందించారు. గ్రామంలో ఏమైనా దొంగతనాలు, రోడ్డుపై జరిగే ప్రమాదాలను చేసిన వ్యక్తులను గుర్తించడంలో సిసి కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటుకు ప్రజా ప్రతినిధులు, సామాజిక సేవా సంఘాలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహమూద్ పట్నం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్ ఆద్వర్యంలో గ్రామ ఉపసర్పంచ్ అమృత శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి ముంజాల శ్రీనివాస్, బత్తుల వెంకటమల్లు, బత్తుల తిరుపతి, సిలివేరు లింగయ్య, పిట్టల ఉపేందర్, కాసోజు వెంకటాచారి, కాసోజు విజయ్, సిలువేరు రవీందర్, ముంజాల యాకన్న, కాంభోజు యాకయ్య, కొమురయ్య, జిల్లా నాగరాజు, తొగరి తిరుపతి, పులుగుజ్జ నారాయణ, గుడెల్లి ముత్తయ్య, మందుల ముత్తయ్య, ఏశబోయిన కిట్టయ్య లను ఎస్ఐ అభినందించారు.



# అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతును ఆదుకోవాలి





### - ఏపీ రైతు సంఘం

**కొత్తపల్లి – నంది పత్రిక:** అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతును ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్ రైతు సంఘం నాయకులు వీరన్న సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎన్ స్వాములు డిమాండ్ చేశారు గురువారం మండలంలోని వీరాపురం గ్రామ రైతు గనుమల పుల్లన్న అప్పుల బాధతో చనిపోయారన్నారు ఆ కుటుంబానికి ప్రభుత్వం 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని అన్నారు వీరాపురంలో ఉన్న పుల్లన్న కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రైతులు ప్రకృతి నిరాదరణకు పాలకుల నిర్లక్ష్యానికి గురవుతున్నారు . అతివృష్టి అనావృష్టి వల్ల వేసిన పంటలు చేతికి రాక రైతులు తీవ్రంగా నష్టపోయి ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు గనుమల పుల్లన్న తనకున్న 5 ఎకరాల సొంత భూమితో పాటు మరో 15 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు ఈ సంవత్సరం ఖరీఫ్ లో మొక్కజొన్న పంట వేసి అధిక వర్షాల వల్ల పంటను కోసుకోలేని పరిస్థితి ఏర్పడి చేతికొచ్చిన పంట చేలోనే మురిగిపోయింది రభి లో వేసిన మినుము పంట సరిగా రాక చేనులోనే వదిలేయాల్సిన పరిస్థితి ఏర్పడింది గత మూడు సంవత్సరాలుగా పుల్లన్నకు వ్యవసాయంలో తీవ్ర నష్టాలు వచ్చాయి వ్యవసాయానికి చేసిన పాత అప్పులకు తోడు కొత్త అప్పులు చేయాల్సి వచ్చింది అన్నారు 20 లక్షల 90 వేల రూపాయలు ప్రైవేట్ వ్యక్తుల దగ్గర ఉన్న అప్పులు చేశారని మరో రెండు లక్షల రూపాయల బ్యాంకులలో అప్పులు ఉన్నాయని ఈ అప్పులు ఎలా తీర్చాలి అనే దిక్కుతోచని స్థితిలో పుల్లన్న ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు రైతుల ఆత్మహత్యలను నివారించడంలో పాలక ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అరకొరా చేతికి వచ్చిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆత్మహత్యల నుండి కాపాడేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టాలన్నారు ఆత్మహత్య చేసుకున్న రైతు పుల్లన్న కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఎక్స్గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని రైతుల అప్పుల నీటిని మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మల్లయ్య రవి శంకర్ మాణిక్యమ్మ వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇళ్ల విషయమై అసెంబ్లీలో మాట్లాడిన ఎంఎల్ఏ మురళీనాయక్.

**కేసముద్రం, మార్చి 26(నంది పత్రిక):** మహబూబాబాద్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి నిరుపేదకు ఇందిరమ్మ ఇల్లు లబ్ధి చేకూర్చేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే మురళి నాయక్ కోరారు. గురువారం శాసనసభ జీరో అవర్ లో మహబూబాబాద్ ఎంఎల్ఏ డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడారు. పట్టాలు లేకపోవడంతో అధిక సంఖ్యలో ఉన్న గిరిజన, నగర ప్రజలకు ఇందిరమ్మ ఇల్లులు రెండో విడతలో గానీ, మూడో విడతలో గానీ ఎలాంటి షరతుల్లేకుండా ఇచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు.



# ఇంటికన్నెలో బాధిత కుటుంబానికి హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ క్వింటా బియ్యం వితరణ.



**కేసముద్రం, మార్చి 26(నంది పత్రిక):** ఇంటికన్నె గ్రామంలో సోమారపు సాయిలు మృతిచెందగా వారి కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ఇంటికన్నె గ్రామానికి చెందిన హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపి, మనోధైర్యాన్ని నింపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్వింటా బియ్యం అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలకు ముందుండి సొంత కుటుంబం లాగా ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని హెల్పింగ్ హాండ్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు నలమాస సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సహాయ కార్యదర్శి గంధసిరి మల్లేష్, చిర్ర సాయి, సోమారపు శశివర్ధన్, సోమారపు ఎల్లయ్య, మిట్టగడుపుల యాకయ్య, బానోత్ యాకూబ్, బానోత్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ డెలివరీ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు





### జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

**కర్నూలు, నంది పత్రిక....** గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ డెలివరీ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి హెచ్చరించారు.గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలోని సంపూర్ణ ఇండెన్ గ్యాస్ గోడౌన్ ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా గ్యాస్ గోడౌన్ ను పరిశీలిస్తూ ప్రతి రోజు ఎన్ని గ్యాస్ సిలిండర్ లను సరఫరా చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. స్టాక్ ను పరిశీలిస్తూ, ర 6 డొమెస్టిక్ సిలిండర్లు,11 కమర్షియల్ సిలిండర్ లు తక్కువగా ఉండడం పట్ల కలెక్టర్ గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యం మీద అసహనం వ్యక్తం చేస్తూ, వెంటనే వారికి నోటీస్ లు ఇవ్వాలని కలెక్టర్ డి ఎస్ ఓ ను ఆదేశించారు.

ఈ సందర్భంగా గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు గ్యాస్ డెలివరీ లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.అదే విధంగా గో డౌన్ పరిధిలో నిబంధనల ప్రకారం అగ్ని మాపక భద్రతా చర్యలను పాటించకపోవడం ఏంటని ప్రశ్నిస్తూ, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అగ్నిమాపక శాఖ అధికారిని ఆదేశించారు. గ్యాస్ డెలివరీ బాయ్ లకు జీత భత్యాలు సరిగా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, అప్పుడే వారు గ్యాస్ డెలివరీ చేసే ఇంటి వద్ద అధిక వసూలు చేయరని కలెక్టర్ తెలిపారు. వారికి జీత భత్యాలు ఇవ్వకపోవడం వల్ల అధిక డబ్బులు వసూలు చేస్తున్నారని, అందువల్ల పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ లో ప్రజల నుండి నెగెటివ్ ఫీడ్ బ్యాక్ వస్తుందని కలెక్టర్ తెలిపారు. డెలివరీ బాయ్స్ వినియోగదారుల నుండి అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు.జిల్లాలో గ్యాస్ కొరత లేదని, 18 వేల సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ ప్రజలకు సూచించారు..జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ మాట్లాడుతూ ప్రజలు గ్యాస్ ను పొదుపుగా వాడుకోవాలని, డొమెస్టిక్ సిలిండర్లను వంటకు మాత్రమే ఉపయోగించుకోవాలని, గీజర్లకు, వాహనాలకు, ఇతర అవసరాలకు వాడుకోకూడదని జాయింట్ కలెక్టర్ సూచించారు.కార్యక్రమంలో కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఎస్ఓ రాజా రఘువీర్, అగ్ని మాపక శాఖ అధికారి జయసింహ, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

# ఉల్లి సాగులో మెళకువలు పై రైతు శిక్షణ కార్యక్రమం

### - హార్టికల్చర్ ఆఫీసర్ కె చందన,



**కొత్తపల్లి – నంది పత్రిక:** ఉద్యానవన శాఖ ఆద్వర్యంలో గురువారం మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామంలో ఉల్లి సాగులో మెళకువలపై రైతులకు శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కర్నూలుడాట్ సెంటర్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ సుజాతమ్మ మాట్లాడుతూ మేలు రకాలైన ఆర్క వికాస్, నాసిక్ రెడ్, భీమా శ్వేత, భీమారెడ్, భీమా వికాస్ రకాలు వేసుకోవాలన్నారు. నారు పోసుకునే ముందు థైరం 3 గ్రాములు చొప్పున విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాన్నారు. నారు 68 వారాల వయసులో నాటుకోవాలని, ముదిరిపోయిన నారుని నాటుకోవడం వల్ల గడ్డలు పగుళ్లు వస్తాయన్నారు. నారు మొక్కలు నాటుకునే ముందు మలథయాన్ 2గ్రా, సీఓసీ 3గ్రా ల చొప్పున కలిపిన ద్రావణంలో ముంచి నాటుకోవాన్నారు. ఎకరాకు 10 టన్నులు చొప్పున ఎఫ్ ఎం 250 కేజీ వేప పిండి వేసుకోవాలని సూచించారు. ఉల్లి నాటుకునే ముందు దుక్కిలో ట్రైకోడెర్మా విరిడి తప్పక వాడాలన్నారు. ఉల్లి నాటుకున్న 30 రోజుల తర్వాత సీఏఎన్ ఒక బ్యాగు. సల్ఫర్ 10 కేజీలు వేసుకోవాలని సూచించారు. ఉల్లిలో తామర పురుగులు, ఆశించినట్లయితే నీలిరంగు జిగురు అట్టలు అమర్చుకోవాలన్నారు. ఈ ' కార్యక్రమంలో విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ విజయ్, రైతులు పాల్గొన్నారు.

# కొత్తూరు సుబ్బరాయుని హుండీ లెక్కింపు..12.38 లక్షలు ఆదాయం..!





**పాణ్యం ప్రతినిధి. నంది పత్రిక. మార్చి 26.** ప్రముఖ శైవక్షేత్రం పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపు వల్ల 12 లక్షల 38వేల 825 రూపాయలు నగదు, 523 గ్రాముల వెండి ఆదాయంగా వచ్చినట్లు ఆలయ ఈవో యం.రామక్రిష్ణ తెలిపారు. ఈ లెక్కింపు గత ఫిబ్రవరి 5వ తేదీ నుండి నేటి వరకు ఈ ఆదాయం సమకూరినదని, నంద్యాల డివిజన్ దేవాదాయశాఖ తనిఖీ అధికారి పి.హరిచంద్రారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, బీరం శివరామిరెడ్డి, అర్చకులు నారాయణస్వామి, సురేష్ శర్మ, బ్యాంక్ అధికారులు, ఏఎస్ఐ రఫీ, పిసి వెంకటేశ్వరరావు, బాలాజీ సేవా సంస్థ, తిరుమల బాలాజీ సేవా సంస్థ అధ్యక్షులు శివయ్య, సీతారామిరెడ్డి సంస్థల సభ్యులు, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో 96 కోర్టుల ఏర్పాటు

**-వాటి నిర్వహణ కోసం 1730 పోస్టులకు గ్రీన్ సిగ్నల్**

**-సత్వర న్యాయం, పెండింగ్ కేసుల తగ్గింపు కోసం కృషి**

**-రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**




**అమరావతి, మార్చి26. నంది పత్రిక** :రాష్ట్రవ్యాప్తంగా 2026–27 లో 96 క్రొత్త మరియు అదనపు కోర్టుల ఏర్పాటు కోసం చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశం అనంతరం న్యాయశాఖకు సంబంధించిన అంశాలకు సంబంధించి ఆమోదం లభించిన వివరాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. పెండింగ్ కేసుల తగ్గింపు కోసం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు కొత్త కోర్టుల ఏర్పాటు కోసం హైకోర్టు రిజిస్టార్( పరిపాలన విభాగం ) ప్రతిపాదించడం జరిగిందని, ఈ ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం జరిగిందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న కోర్టులలో వివిధ స్థాయిలలో, విధి నిర్వహణ నిమిత్తం 1730 పోస్టులను సృష్టించేందుకు కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలిపినట్లు మంత్రి వెల్లడించారు. కొత్తగా మరియు అదనంగా ఏర్పాటు కానున్న కోర్టులలో డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ స్థాయి కోర్టులు 12, సీనియర్ సివిల్ జడ్జి స్థాయి కోర్టులు 25, జూనియర్ సివిల్ జడ్జి స్థాయి కోర్టులు 59 ఏర్పాటు కానున్నట్లు న్యాయ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు.

# బస్సు ప్రమాద ఘటన పై మాజీ ఎమ్మెల్యే బిజ్జం సానుభూతి



**కోయిలకుంట్ల మార్చి 26నందిపత్రిక** మార్కాపురం జిల్లా రాయవరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు సజీవ దహనం కావడం నన్ను తీవ్రంగా కలచివేసిందని వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు పాణ్యం మాజీ ఎమ్మెల్యే బిజ్జం పార్థసారథి రెడ్డి పేర్కొన్నట్లు గురువారం బిజ్జం కార్యాలయ వర్గం తెలిపారు. టిప్పర్– ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సులోని పలువురు ప్రయాణికులు దుర్మరణం పాలవడం బాధాకరం. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవున్ని కోరుకుంటున్నాను. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని ఆయన తెలిపినట్లు వారు పేర్కొన్నారు.

## ఈసారి ఓపెనింగ్ సెర్మనీ లేకుండానే ఐపీఎల్ పోటీలు...?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) నూతన సీజన్ ప్రారంభానికి ముందు జరిగే అట్టహాసమైన ప్రారంభోత్సవ వేడుకలను బీసీసీఐ ఈసారి రద్దు చేస్తున్నట్లు తెలిసింది. గతేడాది బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో మరణించిన 11 మందికి నివాళిగా ఈ సున్నితమైన నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది. ఐపీఎల్ 2026 సీజన్ మార్చి 28న ప్రారంభం కానుంది. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. సాధారణంగా సీజన్ ఓపెనింగ్ మ్యాచ్‌కు ముందు బాలీవుడ్ తారలు, ప్రముఖ గాయకులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అయితే ఈసారి అలాంటి వేడుకలేవీ ఉండబోవని బీసీసీఐ వర్గాలు స్పష్టం చేశాయి. గత ఏడాది జూన్ 4న జరిగిన దురదృష్టకర సంఘటన దృష్ట్యా, మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ఈసారి ఎలాంటి అధికారిక వేడుకలు, వినోద కార్యక్రమాలు నిర్వహించడం లేదు" అని సంబంధిత వర్గాలు తెలిపాయి. గతేడాది (2025) ఆర్‌సీబీ తొలిసారిగా టైటిల్ గెలుచుకున్న సందర్భంగా బెంగళూరులో నిర్వహించిన విజయోత్సవాల్లో తొక్కిసలాట జరిగి 11 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# గ్రామీణ ప్రాంత వ్యవసాయ కూలీలకు ఉపాధిని దూరం జి రాంజీ పథకాన్ని వ్యతిరేకిద్దాం.

## మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ పిలుపు

**నంద్యాల ప్రతినిధి. మార్చి 26 . (నంది పత్రిక ):**కేంద్ర ప్రభుత్వం గ్రామీణ వ్యవసాయ కూలీలకు దూరం చేసే జిరాంజీ పథకాన్ని వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పాత చట్టాన్ని కాపాడుకునేందుకు గ్రామీణ ఉపాధి కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్ పిలుపునిచ్చారు.స్థానిక సిపిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి. హరినాథ్. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. శ్రీనివాసులు ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి లక్ష్మీదేవి ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్షుడు డి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్.




మాట్లాడుతూ భారతదేశంలో పేదరిక నిర్మూలనకు, వలసల నివారణకు వెన్నెముకగా నిలిచిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తన కొత్త విధానాలతో బలహీనపరుస్తోందని ముఖ్యంగా నిధుల కేటాయింపులో చేసిన మార్పులు గ్రామీణ కూలీలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని . గతంలో ఈ పథకం కింద కూలీలకు కనీసం 100 రోజుల ఉపాధి హామీ ఉండేదని, మొత్తం వ్యయభారంలో 90 శాతం వరకు కేంద్రం భరించేదని దీంతో రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడి తక్కువగా ఉండి... పనులు వేగంగా జరిగేవ జరిగేవని. కరువు కాలంలో ఈ పథకం కూలీలకు రక్షణ కవచంలా పనిచేసిందన్నారు.కేంద్రం తన వాటాను 60 శాతానికి తగ్గించి... రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం ఆందోళనకరమని. ఇప్పటికే అప్పుల్లో మారుకుపోయిన రాష్ట్రాలకు ఇది మోయలేని భారమని, దాంతో పనులు నిలిచిపోయే ప్రమాదం ఉందని నిధుల కొరత కారణంగా గ్రామాల్లో పనుల సంఖ్య తగ్గిపోవడంతో పాటు కూలీలకు పని దినాలు తగ్గుతున్నాయని, వేతనాల చెల్లింపులో తీవ్రమైన జాప్యం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు మళ్లీ పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఒకవైపు నిత్యావసర ధరలు పెరుగుతుండగా, మరోవైపు కూలీలకు అందాల్సిన ప్రభుత్వ సహాయం తగ్గించడం అన్యాయమని, కేంద్ర ప్రభుత్వం తన బాధ్యత నుండి తప్పించుకుంటోందని గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతినక ముందే నిధుల విడుదలపై చర్చించాలని . పాత, విధానంలోనే ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

# రేషన్ సరుకుల పంపిణీ ప్రక్రియ లో జాప్యం జరగకూడదు

## జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు, నంది పత్రిక.....**ప్రజలకు అందించే రేషన్ సరుకులు పంపిణీ ప్రక్రియ లో ఎటువంటి జాప్యం జరగకూడదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు.గురువారం వెల్దుర్తి మండల కేంద్రంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ తో కలిసి పౌర సరఫరాల ఎంఎల్ ఎస్ పాయింట్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ గోదాంలో నిల్వ ఉన్న బియ్యం, జొన్నలు, కంది పప్పు తదితర నిత్యావసర సరుకుల నిల్వ స్థితి, నాణ్యత, పంపిణీ విధానం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. సరుకుల నిల్వలో ఎటువంటి లోపాలు లేకుండా పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే రేషన్ దుకాణాలకు సరుకులు సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రేషన్ సరుకుల సరఫరాల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా పర్యవేక్షణ కొనసాగించాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. అదే విధంగా స్టాక్ రిజిస్టర్లు, రవాణా రికార్డులు, పంపిణీ వివరాలను పరిశీలించి, రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. 65 సంవత్సరాలు వయస్సు పైన ఉన్నవారికి మరియు దివ్యాంగులకు హోమ్ డెలివరీ 26 నుండి 30వ తేదీ లోపు వంద శాతం పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, డిఎస్ఓ రాజా రఘువీర్, అగ్ని మాపక శాఖ అధికారి జయసింహ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు గంగ ఉపకాల్వకు గండి





**రుద్రవరం ప్రతినిధి మార్చి 26 (నంది పత్రిక):** రుద్రవరం మండలం లోనిఆర్ నాగులవరం గ్రామ సమీపానగల 22వ బ్లాక్ ఛానల్ కు నీటి సామర్థ్యం పెరిగి రెండు రోజుల క్రితం గండి పడినట్లు రైతు ఇడమడక వెంకటసుబ్బయ్య తోపాటు పలువురు రైతులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ తెలుగు గంగ ప్రధాన కాలం నుండి నీటి సామర్థ్యం పెరిగి 22 వ ఉపకాలవ గండిపడి నీరు పంట పొలాల్లోకి వెళ్లి పంట నష్టం జరిగే ప్రమాదం పొంచి ఉందని వారు తెలిపారు. గత ఏడాది కూడా టి లింగం దిన్నె గ్రామానికి చెందిన రైతులు కాలువ గండిపడి వందల ఎకరాలలో వరి పంట నష్టపోయినట్లు పేర్కొన్నారు. గండిపడిన ఉపకాలవకు రెండు బ్రిడ్జిలు నిర్మించారు. దాని కింద ఉన్న పైపులు చిన్నవిగా ఉండడం వల్ల నీటి ప్రవాహానికి అణువుగా లేకపోవడం వల్ల నీటి ప్రవాహం ఎక్కువై కాలువ గెట్లు తెగి గండి పడుతుందని రైతులు తెలిపారు. అదేవిధంగా కాలువలలో పూడిక తీయకపోవడం కూడా ఒక కారణమని అన్నారు. కాలువకు గండి పడిన విషయం సంబంధిత తెలుగు గంగ అధికారులకు తెలియజేశామని రైతును తెలిపారు. గండ్లు పడకముందే తెలుగు గంగా అధికారులు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

# పశు ఆరోగ్య శిబిరం ఘనవిజయం రైతులకు విస్తృత సేవలు



**వెలుగోడు, మార్చి 26, నంది పత్రిక:** వెలుగోడు మండలం రేగడగూడూరు గ్రామంలో ఆత్మకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఆర్థిక సహకారంతో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స మరియు పశు ఆరోగ్య శిబిరం పశుపోషక రైతులకు నాణ్యమైన పశువైద్య సేవలు అందించడం, పశువుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వెలుగోడు సహాయ సంచాలకులు ఏడి వెంకటేశ్వర్లు తెలిపారు.ఆత్మకూరు మార్కెట్ యార్డు చైర్మన్ వంగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పశువైద్య శాఖ సేవలను రైతులు సద్వినియోగం చేసుకుంటే పశుసంపద ఉత్పాదకత ఉంటుందని, రైతుల ఆదాయం కూడా మెరుగుపడుతుందని తెలిపారు రేగడగూడూరు పశువైద్యశాల వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. మాండ్ల సుమన్ సచివాలయ సిబ్బంది, గోపాలమిత్రలు, అటెండర్లు సమన్వయంతో 40 నల్ల జాతి పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధులకు చికిత్స అందించారు. అదనంగా నివారణ చర్యలలో భాగంగా 200 గొర్రెలు మరియు మేకలకు డీవార్మింగ్ చేయగా, 150 గొర్రెలు మరియు 25 దూడలకు నట్టల నివారణ మందులు తీసుకున్నారు. మేకలకు పీపీఆర్ టీకాలు వేయడం జరిగింది. అలాగే 90 పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు అందించారు.ఈ శిబిరం ద్వారా మొత్తం 56 మంది రైతులు నేరుగా లబ్ధి పొందారు, ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు అంబాల రామసుబ్బారెడ్డి, ఏఈసి కార్యదర్శి సుబ్బారెడ్డి, మార్కెట్ డైరెక్టర్లు అమృజ్, శేషమ్మ (శేఖర్), టీడీపీ నాయకులు మహేశ్వరుడు, రజినీకాంత్, మోహన్, భాస్కర్ పాల్గొన్నారు.

# శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో అవయవ దానం పై అవగాహన




**నంద్యాల ప్రతినిధి. మార్చి 26 . (నంది పత్రిక ):**స్థానిక శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో అవయవ దానం పై అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సుబ్రహ్మణ్యం తెలిపారు. అవయవ దానం ప్రాణాలను రక్షించే మహోన్నత సేవ అని సమాజంలో అవయవ దానంపై అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ గా విచ్చేసిన శాంతిరాం మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ ప్రొఫెసర్ డా. ఎం జానకి గారు మాట్లాడుతూ అవయవ దానం ప్రక్రియ, అర్హత ప్రమాణాలు, మరియు ఒక దాత అనేక మంది జీవితాలను ఎలా కాపాడగలడో వివరించారు. జీవించి ఉన్నప్పుడు కూడా, మరణానంతరం కూడా అవయవ దానం చేయవచ్చని వారు తెలిపారు. అవయవ దానం గురించి ఉన్న అపోహలను తొలగించడం, స్వచ్ఛందంగా దానం చేయడానికి ప్రజలను ప్రోత్సహించడం, మరియు అవయవ దానం ద్వారా అనేక ప్రాణాలను రక్షించవచ్చని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ పి నాగరాజు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# చల్లగిరిగేల పుణ్యక్షేత్రం కడప గడ్డకు ఆధ్యాత్మిక కిరీటం



**పోరుమామిళ్ల, మార్చి 26 (నంది పత్రిక):** కడప జిల్లా పోరుమామిళ్ల సమీపంలో వెలసిన చల్లగిరిగేల పుణ్యక్షేత్రం ఆధ్యాత్మికతకు నిలువుటద్దంగా, చారిత్రక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న ఈ క్షేత్రం భక్తుల విశ్వాసానికి చిరస్థాయిగా నిలిచిన పవిత్ర స్థలంగా పేరుగాంచింది. చల్లని గాలులు, సుందరమైన ప్రకృతి మధ్య కొలువైన ఈ పుణ్యధామం రమణీయ వాతావరణంతో భక్తులను ఆకర్షిస్తోంది. జనమేజయుని సంకల్ప బలం, 11వ శతాబ్దపు నిర్మాణ కౌశలంతో రూపుదిద్దుకున్న ఈ దేవాలయం శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తోంది.ఇక్కడ శ్రీ పట్టాభిరామ స్వామి ప్రత్యేక యోగముద్రలో, సుదర్శన చక్రధారిగా దర్శనమిస్తూ భక్తులకు దివ్యానుభూతిని కలిగిస్తున్నారు. ఆయన దక్షిణాభిముఖంగా కొలువై ఉండడం విశేషం. పక్కనే సీతమ్మ దివ్యమంగళ రూపంలో కాంతులీనుతుండగా, లక్ష్మణ స్వామి ధనుస్సు ధరించి భక్తుల రక్షణగా నిలుస్తున్నారు. అలాగే ఆంజనేయ స్వామి చేత తాళపత్ర గ్రంథాలను ధరించి జ్ఞానం, శక్తికి ప్రతీకగా దర్శనమిస్తుండటం ఈ క్షేత్రానికి ప్రత్యేకతను తీసుకువస్తోంది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవృక్షంలా పేరుగాంచిన ఈ చల్లగిరిగేల పుణ్యక్షేత్రం, సమస్త జనులకు ఆధ్యాత్మిక శాంతి, భక్తి పరాకాష్టను అందించే పవిత్ర స్థలంగా భక్తుల మనసుల్లో అజరామరంగా నిలుస్తోంది. బొల్లు రామమోహన్, రచయిత, పోరుమామిళ్ల

# జిల్లా జైలు మరియు మహిళా జైలు ఆకస్మిక తనిఖీ చేసిన న్యాయమూర్తి

## జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి



**కర్నూలు నంది పత్రిక....** పురుషుల జిల్లా కారాగారము మరియు మహిళ కారాగారామును తనిఖీ చేయడం జరిగినది. ఈ సందర్భంగా జడ్జి జైలు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ ను తనిఖీ చేసి "జైలు ఖైదీలకు ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్స్" గురించి వివరించారు. ఇందులో ఒక అడ్వకేట్, ఒక ప్యారా లీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయ సహాయాలు అందిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తి చేయాలని కోరారు.ఖైధి లకు ఎవరికైనా న్యాయవాదులు లేకుంటే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని తెలిపారు. 70 ఏళ్ళు వయస్సు పై బడిన ఖైధిలకు, అనారోగ్యంతో బాధ పడే వారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తా మని త్వరగా బెయిల్ మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఖైధి లకు అందించే ఆహారాన్ని,రేషన్ ను వారి ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు. ఖైధి లను కోర్ట్ వాయిదా లకు కచ్చితంగా హాజరు చెయ్యాలని ఆదేశించారు.ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారిని సంప్రదించవచ్చును అన్నారు, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో జైలు అధికారులు అసిస్టెంట్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సులోచన మరియు ఖైదీలు పాల్గొన్నారు.



# శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ



**నంద్యాల ప్రతినిధి. మార్చి 26 . (నంది పత్రిక ):**పాణ్యం సమీపంలోని శాంతిరామ్ ఇంజనీరింగ్ కళాశాల ఈ.సి.ఈ విభాగానికి చెందిన విద్యార్థినులు వి.ఉషారాణి ఈ.సి.ఈ) మరియు మనీషా ఈ.సి.ఈ), మార్చి 25న కర్నూలులోని అశోక ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన "ఆవిష్కర్ 2 కే 26" టెక్ సింపోజియం కార్యక్రమంలో 'పేపర్ ప్రజెంటేషన్' విభాగంలో ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నారు.వారు సమర్పించిన " సంస్థాగత నావిగేషన్ కోసం ఒక తెలివైన ప్రాదేశిక మ్యాపింగ్ వ్యవస్థ, ఫ్రైమ్ మేనేజ్‌మెంట్ పోర్టల్" అనే పరిశోధనా పత్రం న్యాయ నిర్ణేతల బృందాన్ని ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే సురేంద్ర మరియు నాగ కార్తిక్ పేపర్ ప్రజెంటేషన్' విభాగంలో ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. వారు సమర్పించిన "స్టూడెంట్ నేషన్ – విద్యార్థుల కోసం పారదర్శక అత్యవసర సహాయ వేదిక".వారి వినూత్న ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యం మరియు సమర్థవంతమైన ప్రజెంటేషన్ తీరుకు గుర్తింపుగా వారికి ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా, కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ శివరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి. సుబ్రహ్మణ్యం, ఈ.సి.ఈ విభాగాధిపతి డాక్టర్ మల్లికార్జున రావు, కోఆర్డినేటర్లు డాక్టర్ ఎన్. ప్రవీణ్ కుమార్ మరియు ప్రొఫెసర్ వి. శంకర్నాథ్, అలాగే విద్యార్థి బృందం తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ విజేతలకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు ఇటువంటి విజయాలనే సాధిస్తూ, తద్వారా కళాశాలకు మరింత గొప్ప కీర్తిని తీసుకువస్తారని వారు ఆశాభావం వ్యక్తం చేశారు..

# యాగంటి దేవస్థానం హుండీ లెక్కింపు



**బనగానపల్లె మార్చి 26నందిపత్రిక** యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి వారి దేవస్థానము నందు 87 రోజులకు సంబంధించిన హుండీలను గురువారం లెక్కించగా రూ.29,88,205 నగదు రూపేనా వచ్చినట్లు బంగారం మరియు వెండి వస్తువులు ఏమి రాలేదని ఆలయ ఏవో పాండురంగారెడ్డి తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమం లో బనగానపల్లె గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి వై.బ్రహ్మానంద రెడ్డి ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి మరియు సభ్యులు రామశేఖర్,భరతుడు,సురేష్, శ్రీరాములు, తిరుమలయ్య, రాజేష్,లక్ష్మీ రెడ్డి, ఆదిరాజు,గోపి,సుశీలమ్మ,సువర్ణ ఆధ్వర్యములో హుండీ లెక్కింపు జరిగింది.అర్చకులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, శ్రీరామ సేవా సమితి, శ్రీ బాలాజీ సేవాసమితి సేవకులు, పోలీసు అధికారులు, యూనియన్ బ్యాంకు, బనగానపల్లె శాఖ సిబ్బంది పాల్గొన్నారని ఈవో తెలిపారు.

# తాగునీటి సమస్యపై ఎంపీడీఓ భరోసా

### ప్యాపిలి మండల సర్వసభ్య సమావేశం
### గైర్హాజరైన అధికారులపై ఎంపీడీఓ శ్రీనివాసులు ఆగ్రహం
### షోకాజ్ నోటీసుల జారీకి ఆదేశం

**నందిపత్రిక - ప్యాపిలి:** మండల కేంద్రంలోని స్థానిక పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ భారతి, ఎంపీటీసీ జయరామయ్య, కో-ఆప్షన్ సభ్యులు అబ్దుల్ రసూల్ మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సమావేశం సాదాసీదాగా జరిగినప్పటికీ, ప్రజా సమస్యలపై కీలక చర్చలు జరిగాయి.

**నీటి సమస్యపై తక్షణ ఫిర్యాదు చేయండి:** మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి ఎద్దడిపై చర్చకు రాగా, ఎంపీడీఓ శ్రీనివాసులు స్పందిస్తూ ప్రజలకు భరోసా ఇచ్చారు. మండలంలో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే ప్రజలు లేదా ప్రజాప్రతినిధులు వెంటనే ఎంపీడీఓకు గానీ, లేదా ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈకి గానీ ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి, నీటి సరఫరా పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యంపై సీరియస్:** మండల అభివృద్ధికి అత్యంత కీలకమైన సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై ఎంపీడీఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్లక్ష్యం చేయడం సరికాదని పేర్కొంటూ, గైర్హాజరైన అధికారులందరికీ తక్షణమే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




**రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి:** తహసీల్దార్ భారతి మాట్లాడుతూ.. మండలంలోని రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అర్జీదారులు ఇబ్బంది పడకుండా సేవలందిస్తామని తెలిపారు. ఎంపీటీసీ జయరామయ్య, అబ్దుల్ రసూల్ తమ పరిధిలోని గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## తుర్తూరు శ్రీ రంగనాథ స్వామి కి పట్టు సమర్పణ

### శ్రీ రంగనాథ స్వామికి పట్టు వస్త్రాల నీ సమర్పించడానికి వెళుతున్న వీఆర్వో దంపతులు



**జూపాడు బంగ్లా : మార్చి : (నంది పత్రిక)** 26దశాబ్దాలుగా తర్తూరు తిరుణాల కర్నూలు జిల్లాలోని పేరెన్నికగన్నది అనాదిగా రెవెన్యూ వారు శ్రీ రంగనాథస్వామి పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితి ఆ కోవలో భాగంగా జూపాడుబంగ్లా వీఆర్వో దంపతులు శ్రీ రంగనాథ స్వామి కి పట్టు వస్త్రాలు సమర్పించారు. రంగనాథుని ఆలయం పూజారి ఆధ్వర్యంలో పెళ్ళి కుమారుని చేసి అలంకరించి పురవీధుల గుండా స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి బాజా భజంత్రీలతో ఊరేగించారు. ఈ తిరునాల రైతు తిరుణాల గా పేరెన్నిక గన్నది. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నేటి నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి రంగనాథ స్వామిని మూలవిరాట్టు తో పాటు వందల సంవత్సరాలుగా పూజలందుకుంటున్న చెక్క బొమ్మను అలంకరించారు. అనంతరం గ్రామస్తులు సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి,ఆలయ కమిటీ చైర్మన్ మందడి నారాయణరెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ఆర్ ఐ శ్రీ రంగారెడ్డి, వీఆర్వోలు రెవెన్యూ సిబ్బంది గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఏపీజీఈఏ డోన్ తాలూకా నూతన కార్యవర్గం ఎన్నిక



**నందిపత్రిక -డోన్** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డోన్ తాలూకా యూనిట్ ఎన్నికలు గురువారం స్థానిక ఏరియా ఆసుపత్రిలోని సంఘ కార్యాలయంలో అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో కే. చంద్రశేఖర్ ప్యానెల్ ఏకగ్రీవంగా ఎన్నికైంది.

**నూతన కార్యవర్గ** కే. చంద్రశేఖర్ నాయకత్వంలోని ప్యానెల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ప్రెసిడెంట్ గా కే. చంద్రశేఖర్ అసోసియేట్ ప్రెసిడెంట్ ఇ చెన్నయ్య , సెక్రెటరీ కే సునీల్ , ట్రెజరర్ కే సురేష్ బాబు వైస్ ప్రెసిడెంట్లు ఎస్. శంషాద్ బేగం, రాఘవేంద్ర గౌడ్, నవ్యభారతి, విజయభారతి, తిప్పమ్మ సెక్రెటరీ రామచంద్రారెడ్డి

ఆర్గనైజింగ్ సెక్రెటరీ: పి. రాజేష్ మహిళా విభాగం ఎన్నిక: అదేవిధంగా ఏపీజీఈఏ మహిళా విభాగం ఎన్నికలు కూడా నిర్వహించారు. ఇందులోనూ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అధ్యక్షురాలు ఐ. రాజేశ్వరి సెక్రెటరీ వి. అరుణకుమారివైస్ ప్రెసిడెంట్లు శకుంతల, పి. సుజాత, రాధమ్మ, బి. శోభారాణి, ఎస్. సుజాత సెక్రెటరీలు పెద్దక్క, పరమేశ్వరి ఈ ఎన్నికల ప్రక్రియకు నంద్యాల జిల్లా చైర్మన్ శ్రీ నాగేంద్రప్ప పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఎన్నికల అధికారిగా శ్రీహరి, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా పి. వెంకట చక్రధర్, జిల్లా నాయకులు బి. శ్రీనివాసులు పాల్గొని ఎన్నికలను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోన్ తాలూకా పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని, నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని నూతన అధ్యక్షులు కే. చంద్రశేఖర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## ఎస్.రంగాపురంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

**నందిపత్రిక -ప్యాపిలి** ప్యాపిలి మండలం ఎస్.రంగాపురం గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి మ్యాట్ కబడ్డీ పోటీలు అత్యంత ఉత్సాహంగా జరగనున్నాయి. ఎస్ ఆర్ యూత్ మరియు గ్రామ పెద్దల సహకారంతో ఈ భారీ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. మార్చి 27వ తేదీ, మధ్యాహ్నం 1:00 గంటకు ఎస్.రంగాపురం గ్రామం, ప్యాపిలి మండలం,

**ఎంట్రీ ఫీజు: 500 మాత్రమే.** పోటీలలో గెలుపొందిన జట్లకు నిర్వాహకులు భారీ నగదు బహుమతులను ప్రకటించారు. ప్రథమ బహుమతి 30,000 సుంకర నాగరాజు, గుడిపాడు నరసింహులు, పరమేష్ పెద వెంకటేష్ సన్స్ వారి సౌజన్యంతో). ద్వితీయ బహుమతి: 20,000 దేవకుంట బ్రదర్స్ – రాఘవేంద్ర, సూర్యప్రతాప్ సౌజన్యంతో తృతీయ బహుమతి 10,000 బండమీద సుధాకర్, సుంకర కేశవ సౌజన్యంతో నాల్గవ బహుమతి 5,000 శివ సాయి విద్యాసంస్థల అధినేత సురేష్, డెలి సంజీవ్ కుమార్ సౌజన్యంతో

ఐదవ బహుమతి: 3,000 తలారి మహేష్ సౌజన్యంతో నిర్వాహకులు కొన్ని కీలక నిబంధనలను విధించారు. పోటీలు మ్యాట్ కోర్టుపై జరుగుతాయని, క్రీడాకారులు తప్పనిసరిగా మ్యాట్ షూస్ ధరించాలని సూచించారు. ప్రతి క్రీడాకారుడు తమ సొంత గ్రామం తరపున మాత్రమే ఆడాలని, ఒరిజినల్ ఆధార్ కార్డు రేషన్ కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని తెలిపారు. ప్రో-కబడ్డీ నిబంధనల ప్రకారమే ఆట నిర్వహించబడుతుంది.

**సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:** ఆసక్తి గల జట్లు ఇతర వివరాల కోసం 7013065017 9885792137 నంబర్లను సంప్రదించాలని యూత్ సభ్యులు కోరారు.

## కళ్యాణానికి ముస్తాబైన రామాలయాలు



**కొత్తపల్లి - నంది పత్రిక :** శ్రీరామనవమి పండుగా సందర్భంగా మండల కేంద్రం కొత్తపల్లి, ఎదురుపాడు , మరియు ఆయా గ్రామాలలో రామాలయాలు శుక్రవారం జరిగే సీతారాముల కల్యాణ మహోత్సవానికి సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు, పుష్పాలంకరణలతో ఆలయాలు భక్తులకు స్వాగతం పలుకుతున్నాయి. శుక్రవారం అభిజిత్ లగ్న పుష్కారాంశ శుభలగ్న ముహూర్తంన సీతారామ కళ్యాణం కనుల విందుగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరైస్వామి వారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కోరారు. కల్యాణ అనంతరం తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ఎదురుపాడు గ్రామంలో శనివారం రథోత్సవ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.



## ఈనెల 28న రుద్రవరం మేజర్ పంచాయతీ మార్కెట్ వేలంపాటలు.

### 10 శాతం పెంపుతో వేలం పాటలు నిర్వహిస్తాం: ఇన్చార్జి ఈవో రామకృష్ణ



**రుద్రవరం ప్రతినిధి మార్చి 26 (నంది పత్రిక):** ఈనెల 28వ తేదీన రుద్రవరం మేజర్ పంచాయతీసంత మార్కెట్ దిన మార్కెట్ మరియు కబేల మార్కెట్ వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఇంచార్జీ ఈవో వడ్డేరామకృష్ణ తెలిపారు. గురువారం స్థానిక సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు, సర్పంచ్ బైరి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది వేలం పాటలను గతంతో పోలిస్తే 10 శాతం అదనంగా పెంచి ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. పెంచిన మొత్తాల ప్రకారం వారపు సంత మార్కెట్‌ను రూ 9,19,600 రూపాయలతో దిన మార్కెట్‌ను 4,20,200 రూపాయలతో కబేలా మార్కెట్ 9,350 రూపాయలతో పాట ప్రారంభమవుతుందని వివరించారు. ఈ వేలంలో పాల్గొనేవారు తప్పనిసరిగా రుద్రవరం గ్రామ నివాసులై ఉండాలని, సంత మార్కెట్‌కు రూ 1 లక్ష రూపాయలు, దిన మార్కెట్‌కు రూ 50 వేలు, కబేల మార్కెట్ కు రూ10 వేల రూపాయలు ధరావత్తు చెల్లించాలని సూచించారు. అత్యధిక పాట దక్కించుకున్న వారు 7 రోజుల్లోపు పూర్తి మొత్తాన్ని గ్రామ పంచాయతీలో జమ చేయాలని, గడువులోగా చెల్లించని పక్షంలో వేలం రద్దు చేసి తిరిగి నిర్వహించబడుతుందని స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ ఆదాయాన్ని పెంచి వేసవిలో తాగునీరు, విద్యుత్ దీపాలు మరియు ఇతర పారిశుధ్య పనుల నిర్వహణకు గ్రామస్తులు, వ్యాపారులు సహకరించాలని ఆయన కోరారు.

## నూతన తహసీల్దార్ ఉదయ భాస్కర్ రాజుకు ఘన స్వాగతం సమస్యల పరిష్కారానికి హామీ



**పోరుమామిళ్ల, మార్చి 26 (నంది పత్రిక )** కడప జిల్లా పోరుమామిళ్ల మండలానికి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ శ్రీ ఉదయ భాస్కర్ రాజు ని హ్యూమన్ రైట్స్ స్టేట్ జాయింట్ సెక్రటరీ ముత్యాల ప్రసాదరావు, దళిత సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలు ఏవైనా సరే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయాలని, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. తహసీల్దార్ ఇచ్చిన హామీపై హ్యూమన్ రైట్స్ నాయకులు, దళిత సంఘం ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేస్తూ, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు.

## ఎర్రమఠం గ్రామ రైతులను ఆదుకోవాలి



**కొత్తపల్లి - నంది పత్రిక :** ఎన్ హెచ్ 167 రోడ్డు విస్తీర్ణంలో తమ పొలాలు పోతున్నాయని వాటికి సరైన నష్టపరిహారం ప్రభుత్వం ఇవ్వాలని ఎర్రమటం గ్రామ రైతులు మద్దిలేటి చిన్న ఏసేపు శీలం వేదమూర్తి నారాయణ జయన్న విజయ్ కుమార్ చిన్న మద్దిలేటి కోరారు గురువారం మండల కేంద్రంలోని తాసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఉమారాణి కలిసి వినతి పత్రన్ని అందజేశారు ఈ సమస్యపై తహసిల్దార్ నేషనల్ హైవే ఇంజనీర్లతో మాట్లాడి రైతుల సమస్యలకు పరిష్కారం చూపాలని సానుకూలంగా స్పందించదంతో రైతులు ఎమ్మార్వో గారికి కృతజ్ఞతలు తెలిపారు ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ 1980వ సంవత్సరంలో శ్రీశైలం ప్రాజెక్టు తయారు కోసం ప్రభుత్వం కోసం తమ ఊరు వదిలి పెట్టడం జరిగింది కొత్త ఊరు కట్టుకొని జీవనం సాగిస్తున్నారు నేడు హైదరాబాద్ నుండి చెన్నైకి నేషనల్ హైవే అంటూ రోడ్డు విస్తరణలో భాగంగా మా సారవంతమైన పొలాలు పోతున్నవి ఉండనానుకుని వందకు పైగా బోర్లు ఉన్నది వీటన్నిటిని నేడు కోల్పోతున్నాం కాబట్టి కొత్తగా నిర్మిస్తున్నా రోడ్డుకు ప్రత్యేక తూములు ఏర్పాటు చేయాలని మరియు ఒక సెంటుకు 4000 రూపాయలు ఇవ్వడం బాధాకరమని సారవంతమైన పొలాలు మాకు జీవన ఆధారం ఇదే కాబట్టి సెంటుకు 20వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని ఇచ్చిన తరువాతనే రోడ్డు పనులు మొదలు పెట్టాలని గ్రామ రైతులు కోరారు

## రుద్రకోటేశ్వర స్వామి దర్శనానికి రుసుము తగ్గించాలి భక్తుల విజ్ఞప్తి

**వెలుగోడు/ఆత్మకూరు, మార్చి 26, నంది పత్రిక:** నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం పరిధిలోని నల్లమల అడవుల్లో వెలసిన శ్రీ రుద్రాణి సమేత రుద్రకోటేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తుల కోసం దర్శన రుసుమును తగ్గించాలని రుద్రకోటేశ్వర స్వామి సేవా కమిటీ ప్రభుత్వాన్ని విన్నవించుకుంటూ ఈ మేరకు వారు వినతి పత్రాన్ని సమర్పించారు.నల్లకాలువ గ్రామానికి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ దేవస్థానంలో పరమేశ్వరుడు స్వయంభూ లింగంగా దర్శనమిస్తున్నారని, గత శతాబ్ద కాలంలో భక్తులు ఇక్కడికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటూ ఉన్నారని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ క్షేత్రానికి అనేక అవధూతలు, సన్యాసులు తరచుగా వచ్చి పూజలు నిర్వహిస్తున్నారని, కొంతమంది భక్తులకు స్వామివారు దివ్య జ్యోతి రూపంలో దర్శనమిచ్చిన అనుభవాలు ఉన్నాయని పేర్కొన్నారు.అదేవిధంగా రుద్రకోటేశ్వర స్వామి ప్రస్తావన మహాభారతంలోని అనుశాసన పర్వం, శివ పురాణం, కాశీ ఖండం, బ్రహ్మాండ పురాణం, మత్స్య పురాణం వంటి గ్రంథాల్లో ఉన్నట్లు వివరించారు. క్షేత్రంలోని కల్పవృక్షం భక్తుల కోరికలను తీర్చుతుందని స్థానికులకు విశ్వాసం.అయితే, ఈ ఆలయం పులుల అభయారణ్యంలో ఉన్నందున గతంలోని శాఖ అధికారులు దర్శనాన్ని ఆదివారం, సోమవారాలకు మాత్రమే నమోదు చేశారు. భక్తులు ఈ నిర్ణయాన్ని గౌరవిస్తూ ఆ రెండు రోజుల్లోనే దర్శనానికి వస్తున్నారని పేర్కొన్నారు.కానీ, ఆలయానికి వెళ్లే మార్గంలో టోల్ గేట్ వద్ద నాలుగు చక్రాల వాహనాలకు రూ.300, మూడు చక్రాల వాహనాలకు రూ.150 రుసుము వసూలు చేయడం వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పేద భక్తులు అద్దె వాహనాల్లో సమూహంగా రావడంతో ఈ రుసుము భారంగా మారుతోంది.అదేవిధంగా, ఆలయ పరిసరాల్లో మహిళలకు తగిన మరుగుదొడ్ల సౌకర్యం లేకపోవడం వల్ల తీవ్ర ప్రజలు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో రుద్రకోటేశ్వర స్వామి సేవా కమిటీ విజ్ఞప్తి చేసింది.ప్రభుత్వం, సంబంధిత అధికారులు ఈ సమస్యలపై స్పందించి తగిన చర్యలు తీసుకుంటే భక్తులకు ఎంతో ఉపశమనం కలుగుతుందని కమిటీ సభ్యులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## అమెరికాను ఎదుర్కొనేలా ఇరాన్ ఎత్తులు ఖర్గ్ ఐలాండ్‌లో బారగీ మందుపాతరలు

ఇరాన్‌కు అత్యంత కీలకమైన ఖర్గ్ ఐలాండ్ ను స్వాధీనం చేసుకునే ఉద్దేశంతో పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా తన బలగాలను మోహరిస్తోందని వార్తలు వస్తున్న ఈనేపథ్యంలో ఖర్గ్‌ను రక్షించుకునేందుకు ఇరాన్ సిద్ధమైంది. ఇందుకోసం అమెరికా దళాలను అక్కడ అడుగుపెట్టనీయకుండా ఇరాన్ భారీగా మందుపాతరలు అమర్చినట్లు సమాచారం. వాటితో విధ్వంసకర ఉచ్చులు పన్నుతోందని తెలుస్తోంది. అంతేకాకుండా అక్కడికి భారీగా బలగాలను కూడా తరలిస్తున్నట్లు అంతర్జాతీయ వార్తా కథనం వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. పశ్చిమాసియా ప్రాంతంలోని ఓ దేశం సహకారంతో ద్వీపాలను ఆక్రమించుకోవాలని మా శత్రువులు సన్నాహాలు చేస్తున్నారన్న నిఘా సమాచారం ఉంది.

## ముఖ్యమంత్రి పర్యటన లో అప్రమత్తంగా ఉండండి.

### కమిషనర్ ఎన్.మౌర్య.

**తిరుపతి బ్యూరో చీఫ్మర్చి 26నంది పత్రిక** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటనలో అధికారులు అందరూ అప్రమతంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ నెల 30న తిరుపతిలో జరగనున్న కార్యక్రమం లో ముఖ్యమంత్రి పాల్గొననున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఆయన పర్యటించనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులతో కలసి కమిషనర్ పర్యటించారు. అన్ని మార్గాల్లో పారిశుధ్యం మెరుగ్గా చేపట్టాలని, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే భద్రతా ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని పోలీస్ అధికారులకు సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట ట్రైనీ కలెక్టర్ రఘువంశీ, అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసికుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఎస్ .పి. భక్తవత్సలం, మేనేజర్ హాసీమ్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, తదితరులు ఉన్నారు.



## ఎమ్మెల్యే చొరవతో గట్టు తండాలో బోర్ వేయింపు ప్రస్తుత సమస్యకు పరిష్కారం

**వెలుగోడు, మార్చి 26, నంది పత్రిక:** వెలుగోడు పట్టణంలోని స్థానిక గట్టు తాండాలో ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు బోర్ వేయించారు. గ్రామ ప్రజల త్రాగు నీటి కొరత గట్టు తండాలో చాలా కాలంగా సమస్య తీవ్రంగా ఉండటంతో స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, ఎమ్మెల్యే వెంటనే స్పందించి బోర్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. దీనితో గ్రామ ప్రజలకు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమంలో వెలుగోడు మండల అధ్యక్షుడు ఎం. కలాం, నాయక్, పటాన్ పాల్గొన్నారు. స్థానికులు కూడా కార్యక్రమంలో పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గట్టు తండా ప్రజలు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి టిడిపి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## గ్యాస్ ఆటో ను అడ్డుకున్న గ్రామస్థులు.

**వెలుగోడు మార్చి 26 నంది పత్రిక :** వెలుగోడు పట్టణం ద్వారకానగర్ పోస్టాపీసు వద్ద గ్రామస్థులు గురువారం గ్యాస్ ఆటో ను అడ్డకుని పంపిణి ని అడ్డుకున్నారు. గ్యాస్ కొరత కారణంగా ఈ పరిస్థితి వచ్చింది. గ్యాస్ డెలివరీ బుకింగ్ చేసుకున్న వినియోగ దారులకు 12 రోజులకు కూడా అందడం లేదు. అధికారులేమో గ్యాస్ ఎలాంటి కొరత లేదంటూ ప్రకటనలు గుప్పిస్తున్నారు. కానీ గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. గ్యాస్ డెలివరీ కోసం సిబ్బంది రాగా , బిల్లుల ప్రకారం ఇంటింటికి వెళ్లి ఇవ్వకుండా, ఒకేచోట నిలపెట్టుకొని వచ్చిన అందరికి ఇవ్వడం ఏంటని ఘర్షణకు దిగారు. ఇక్కడే అందరికి ఇవ్వడం లో ఆంతర్యం ఏమిటి, ఎక్కువ రేటు తీసుకొని ఇస్తున్నారా అంటూ ఆరోపణలు చేశారు. ఈ విషయం తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ దృష్టికి పోవడం తో సాయంత్రం గ్యాస్ ఎజన్సీ కార్యాలయం తనిఖీ చేశారు. మీరు డ్యూటీ సక్రమంగా చేయడం లేదంటూ గ్యాస్ నిర్వాహకులను ప్రశ్నించారు. గ్యాస్ ఎజన్సీ నిర్వాహకులు మా సిబ్బంది బిల్లుల ప్రకారం డెలివరీ చేస్తున్నారని, మా విధులను అడ్డుకుంటే మేమెలా పనిచేయాలని , మాకు రక్షణ ఎక్కడ అంటూ తహసీల్దార్ ను ప్రశ్నించారు.



## ఉపాధి హామీ కూలీల ఆకలి కేకలు ప్రభుత్వాలకు వినబడవు

### పనులు చేసినా కూలీలకు దక్కని వేతనం

### సిపిఐ బనగానపల్లె మండల కార్యదర్శి శివయ్య



**బనగానపల్లె మార్చి 26నందిపత్రిక** ఉపాధిహామి కింద పనులు చేసిన కూలీలకు వేతనం రాకపోవడంతో కూలీలు ఆకలి మంటలతో అల్లాడుచున్నారని వెంటనే వారి వేతనాలు చెల్లించాలని బనగానపల్లె సిపిఐ మండల కార్యదర్శి శివయ్య అన్నారు. గురువారం బనగానపల్లె సీపీఐ కార్యాలయంలో శివయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివసించే జాతీయ ఉపాధి హామీ కార్మికులు దాదాపుగా మూడు నెలలుగా ఉపాధి హామీ వేతన కూలిలు కార్మికుల అకౌంట్లో జమ కాలేదు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉగాది సంబరాలు అంగరంగ వైభవంగా నడుపుతున్నాయి కానీ నిత్యవసర ధరలు ఒకవైపు గ్యాస్ కొరతతో గ్యాస్ రేట్లు పెరిగి పేదవాళ్లు చితికి పోతున్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే అధికారులను సమాచారం అడిగితే మా వంతు పని మేము చేశాము ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు మా జీతాలకే గతి లేదని వాపోతున్నారు కష్టం చేసి కూలీలు వస్తాయి ఉగాది శ్రీరామనవమి బాగా చేసుకోవచ్చు అని కలలుగన్న ఉపాధి హామీ కూలిలకు వాళ్ళ ఆశలపై నీళ్లు చల్లింది కేంద్ర ప్రభుత్వం నేను దృఢంగా ఉన్నాను దేశం వెలిగిపోతుంది అని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారు చట్టసభల పైన ప్రకటించడం కాదు గ్రామీణ ప్రాంతాల్లోకి వెళ్లి చూస్తే వారి కష్టాలు ఏందో తెలుస్తాది కావున భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గా డిమాండ్ చేస్తా ఉన్నాం తక్షణమే ఉపాధి హామీ బిల్లులను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తా ఉన్నాం అని అన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి సంజీవులు మండల సమితి సభ్యులు శివ నాగయ్య రవి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఏరి స్వామి తదితరులు పాల్గొన్నారు

# గనులు, క్వారీల నిర్వహణపై దృష్టి సారించాలి..!

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

**కడపబ్యూరో చీఫ్ , మార్చి 26 నంది పత్రిక :** జిల్లా ఆర్థిక అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న గనులు, క్వారీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మైనింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో.. జిల్లాలో మైనింగ్ క్వారీల నిర్వహణ, ప్రధాన ఖనిజ బ్లాకుల కార్యాచరణ, భూ షెడ్యూల్/వర్గీకరణ/కడాస్ట్రల్ ప్రత్యేకతలతో పాటు రెవెన్యూ భూజల సమస్యలు తదితర అంశాలపై.. జేసీ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ భావన లతో కలిసి సంబందిత అధికారులతో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో అపారమైన ఖనిజ నిక్షేపాలు ఉన్నాయని, వాటిని జిల్లా ఆర్థిక వనరుగా సద్వినియోగం చేసుకోవడంలో ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత మైనింగ్ అధికారులపై ఉందన్నారు. అందులో భాగంగా జిల్లాలోని గనుల నిర్వహణ పనితీరుపై సమీక్షించారు. ప్రస్తుతం జిల్లాలో ఎన్ని గనులు నిర్వహణలో ఉన్నాయి..? నిర్వహణలో ఉన్న అన్ని క్వారీలకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా..? నిబంధనలకు లోబడి నిర్వహణలో ఉన్నాయా..? అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తున్నారా..? సామాజిక బాధ్యత, వార్షిక రాబడి, ఆదాయం తదితర అంశాలపై సమీక్షించి పలు ఆదేశాలు జారీ చేశారు. మైన్స్, క్వారీలకు సంబంధించి.. పెండింగ్ లో ఉన్న వాటికి టెండర్ నోటిఫికేషన్ ఇవ్వాలని, రెవెన్యూ, పర్యావరణ, అటవీ సంబంధిత పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కారంకు చర్యలు చేపట్టాలన్నారు. అడిటింగ్ రిపోర్ట్ కూడా విధిగా అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్య మైన్స్ డిడి సుబ్రమణ్యం, మైన్స్, పర్యావరణ, అటవీ, విజిలెన్స్, రెవెన్యూ సంబందిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## కళ్లముందే ఎండిపోతున్న రబీ పంటలు వెంటనే కె.సి. కెనాల్ నీరు విడుదల చేయాలి:

### సి.పి.ఐ. (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్.



**జూపాడుబంగ్ :మార్చి :26: (నంది పత్రిక)** మండలం పరిధిలో నెలకొన్న తీవ్ర సాగునీటి ఎద్దడిపై సి.పి.ఐ. (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటికే గత ఖరీఫ్ సీజన్లో కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న, పత్తి, మిరప, ఉల్లి పంటలు దెబ్బతిని, గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ఎర్రగూడూరు తూమును మూసివేయడం తో పైభాగంలో ఉన్న వేల ఎకరాల పంటలు నీరు లేక ఎండిపోతున్నాయని నాయకులు ఆరోపించారు. రైతులు అప్పులు చేసి, ఆస్తులు అమ్ముకుని మొక్కజొన్న, మినుము, వరి, కంది వంటి పంటలను ఈ సందర్భంగా పార్టీ నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి, కుటుంబాలను పణంగా పెట్టి పంటలు వేసుకుంటే ప్రభుత్వం మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోంది. వెంటనే ఎర్రగూడూరు తూమును తెరచి, కె.సి. కెనాల్ ద్వారా నిరంతరాయంగా నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం. రైతు బతకాలి అంటే నీరు తప్పనిసరి దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి అని గట్టిగా డిమాండ్ చేశారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఎర్రగూడూరు తూమును తెరవాలని, కె.సి. కెనాల్ ద్వారా కనీసం ఏప్రిల్ 15వ తేదీ వరకు నిరంతరాయంగా సాగునీటిని విడుదల చేయాలని పార్టీ డిమాండ్ చేసింది. లేకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నాలు, రహదారి దిగ్బంధనాలు చేపట్టి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది. రైతును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, సాగునీటి విడుదల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సి.పి.ఐ బాలకృష్ణ. (ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో. సత్యమయ్య రైతులు .రవి గౌడ్. బన్నూరు శ్రీనివాసులు. బాల మద్దిలేటి గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు

### జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**కడప,బ్యూరో చీఫ్ మార్చి 26 నంది పత్రిక :** "పచ్చటి పందిళ్లు, మామిడాకు తోరణాలు, బంతి పూల దండలు.. శుభ శకునాలకు సంకేతాలు. రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలన, సంక్షేమ పథకాల ఫలాలతో ప్రతి ఇంటా నిత్యకళ్యాణం.. పచ్చతోరణాలతో రాష్ట్రం శ్రీరామరాజ్యాన్ని తలపిస్తోందని.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు సంతృప్తస్థాయిలో అందడంతో.. తెలుగు నేలపై.. ప్రతి గుమ్మం ముందూ పచ్చ తోరణాలు శ్రీరామ జయంతి వేడుకలను స్వాగతం పలుకుతున్నాయన్నారు. కుటుంబ జీవన గమనంలో.. కష్ట సుఖాలు సహజమే అనే సత్యానికి.. సీతారాముల ఆదర్శ జీవిత సారాంశమే నిదర్శనం అన్నారు. వారి వైవాహిక జీవితంలో ప్రతీ ఘట్టం భవిష్య తరాలకు ఆదర్శం కావాలని, రామరాజ్యాన్ని తలపిస్తున్న రాష్ట్ర పరిపాలనలో అందరికీ అందరికీ శ్రీ రామరక్ష ఉండాలని కోరుకుంటూ.. జిల్లా ప్రజలకి శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ శ్రీరామ నవమి సందర్భంగా.. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని, అందరి భాగస్వామ్యంతో అభివృద్ధిలో జిల్లా ముందడుగు వేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# బండి ఆత్మకూరులో జిల్లా సబ్ రిజిస్టార్



**బండి ఆత్మకూరు నందిపత్రిక మార్చి 26 :** నంద్యాల జిల్లా సబ్ రిజిస్టార్ అశోక్ గురువారం బండి ఆత్మకూరు రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. సబ్ రిజిస్టర్ కార్యాలయంలోని దస్రాలు, పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఆకస్మికంగా జిల్లా సబ్ రిజిస్టార్ బండి ఆత్మకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని సందర్శించడంతో సంబంధిత సిబ్బంది సంబ్ర మశ్చర్యాలకు గురయ్యారు. డాక్యుమెంట్ల నమోదు రిజిస్ట్రేషన్ విధానం ఫీజుల వసూలు డ్యూటీ లెక్కింపు వంటి అంశాలను గురించి కార్యాలయ సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. రిజిస్ట్రేషన్లకు అనుసరిస్తున్న స్లాట్ విధానం అందులో ప్రయోజనాలను గురించి వాకప్ చేశారు. రిజిస్ట్రేషన్ విధానంలో సేవలలో ఎలాంటి లోపం ఉండకూడదని పారదర్శకంగా పనులు జరగాలని దళారుల ప్రమేయాలను లేకుండా చూసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియలో దలార్ల ప్రక్రియ ఎక్కువగా ఉందని సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని విమర్శలు ఆరోపణలు రావడంతో బండి ఆత్మకూరు సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని జిల్లా రిజిస్టర్ తనిఖీ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. నంద్యాల జిల్లాలో స్టాంపులు రిజిస్ట్రేషన్ ల ద్వారా ప్రభుత్వానికి 1083 కోట్ల ఆదాయం వచ్చినట్లు జిల్లా రిజిస్టార్ అశోక్ తెలిపారు.

## బొమ్మలసత్రంలో అగ్నిప్రమాదం:

### 7 గడ్డివాములు దగ్ధం. బాధితులకు అండగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి...





**నంద్యాల సిటీ బ్యూరో మార్చి 26 ( నంది పత్రిక )** నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం బలిజపేటలో విషాదం చోటుచేసుకుంది. పశువుల దాణా కోసం నిల్వ ఉంచిన 7 గడ్డివాములు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనపై సమాచారం అందుకున్న నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి వెంటనే స్పందించారు. ప్రమాద స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించిన ఆయన, బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం బాధితులకు తన వంతు సాయంగా 35 వేల రూపాయల నగదును అందజేశారు. ఈ సందర్భంగా శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. కష్టపడి పశువుల కోసం నిల్వ చేసుకున్న దాణా ఇలా కాలిబూడిదవ్వడం అత్యంత దురదృష్టకరమన్నారు. బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, బాధితులను తక్షణమే ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ అగ్నిప్రమాదం వెనుక ఏవైనా కారణాలు ఉన్నాయా అన్న కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. స్థానిక వైసీపీ నాయకులు అశోక్ కుమార్ రెడ్డి, మాధవరెడ్డిలు ముందుకు వచ్చి పశువులకు అవసరమైన దాణా అందిస్తామని హామీ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు దస్తగిరి, ఆర్టీసీ భాస్కర్ రెడ్డి, అనంతలక్ష్మి, శంకర్రెడ్డి, జాకీర్, సాయిరాంరెడ్డి, కత్తినజీర్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రజా సమస్యల పరిష్కారానికి వారదులు జర్నలిస్టులు జర్నలిస్ట్ యూనియన్ నాయకులు



**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 26, నంది పత్రిక** జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వాలకు వారదులుగా ప్రజా సమస్యలను పత్రికలలో ప్రచురించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని, వారి కృషి ఎంతో అభినందనీయమని ఆళ్లగడ్డ తాలూకా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు అమీర్ బాషా, శారదా శిల్పకళా మందిరం అదినేత దురుగడ్డ రవీంద్రాచారి లు తెలిపారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర సభ్యులు ముల్లా నిజాముద్దీన్, ఆళ్లగడ్డ తాలూకా అధ్యక్షులు కరణం శ్రీనివాసరావు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి సిహెచ్ బ్రహ్మంల ఆధ్వర్యంలో స్థానిక టి ఎస్ ఫంక్షన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ యూనియన్ లు సంయుక్తంగా ప్రింట్ మీడియా జర్నలిస్టుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ కార్డులు, 60 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్, హెల్త్ స్కీమ్, రైల్వే పాసులతో పాటు మరెన్నో సమస్యలపై పోరాటాలు చేస్తున్నా మన్నారు. వీటినన్నింటిని సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందనీ వారు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథులు శారద శిల్పకళా మందిరం అధినేత దురుగడ్డ రవీంద్ర చారి దంపతులు, ప్రముఖ మహిళా శిల్పి భువన, తాలూకా ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు అమిర్ భాష ల చేతుల మీదుగా ప్రింట్ మీడియా జర్నలిస్టులను సన్మానించారు. అనంతరం వారి చేతుల మీదుగా జర్నలిస్టులందరికీ నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఓబులం ప్రసాద్, సీనియర్ విలేకరులు కేపివి సుబ్బారావు, యనమల నాగరాజు, టీవీఎస్వి ప్రసాద్, ఇస్మాయిల్ బేగ్, కిరణ్, జాఫర్, మహమ్మద్ హుసేన్, అక్రమ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రచందనం అక్రమ రవాణా కేసు

శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన వైసీపీ నాయకుడికి తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఎర్రావారిపాలెం మండలం యనమలవారిపల్లెకు చెందిన ఉటుకూరి చెంగల్రెడ్డి, తిమ్మసముద్రానికి చెందిన వెంకట్రెడ్డి 2015వ సంవత్సరంలో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వీరిపై భాకరాపేట స్టేషన్లో కేసు నమోదయ్యింది. చెంగల్రెడ్డిపై నేరం రుజువు కావడంతో తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహామూర్తి రెండేళ్ళ జైలు శిక్ష, రూ.20 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

# మృతుని కుటుంబానికి జనసేన ఆర్థిక సహాయం

**మహానంది, మార్చి 26 (నంది పత్రిక):-** మహానంది మండలం బుక్కాపురం మజారా పుట్టుపల్లె గ్రామానికి చెందిన శ్రీను అనే యువకుడు అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మండల జనసేన పార్టీ నాయకులు మారెడ్డి రామయ్య మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరిమర్శించి, అంత్యక్రియలకు రూ. 5 వేలు అందజేశారు. మారెడ్డి రామయ్య మాట్లాడుతూ.. చిన్న వయసులోనే మృతి చెందడం చాలా బాధాకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ తరఫునుంచి తమ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జన సైనికుల సహకారంతో ఆర్థిక సహాయంగా అందజేశామన్నారు. పేదలకు ఎల్లప్పుడూ జనసేన పార్టీ అండగా నిలబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు మిద్దె ఖాదరయ్య,కొల్లి జయపాల్, తిరుపాల్ , చిక్యాల చంద్ర,దిమ్ము దేవరాజు, దిమ్ము మధు వీర మహిళలు దీప, పూజిత , వరలక్ష్మి, మార్తమ్మ పాల్గొన్నారు.



## ప్రీతీ జింటా నాకు అక్క లాంటిది: క్రికెటర్ జితేశ్ శర్మ

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ సహ యజమాని ప్రీతి జింటాను తాను సోదరిలా భావిస్తానని భారత వికెట్ కీపర్ బ్యాటర్ జితేశ్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఇటీవల జరిగిన ఐపీఎల్ వేలంలో తనను పంజాబ్ జట్టు తిరిగి దక్కించుకోలేకపోయినప్పుడు, ప్రీతి వ్యక్తిగతంగా ఫోన్ చేసి 'సారీ' చెప్పారని ఓ పాడ్కాస్ట్లో గుర్తుచేసుకున్నాడు. జితేశ్ శర్మ మాట్లాడుతూ, "నేను ప్రీతి జింటాను చాలా గౌరవిస్తాను. ఆమె నాకు తరచుగా ఫోన్లు, మెసేజ్లు చేస్తుంటారు. ఆమెను నా పెద్దక్కలా చూస్తాను. నేను హిమాచల్ ప్రదేశ్ వాడినని తెలిశాక మా మధ్య బంధం మరింత బలపడింది.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం

**నంది పత్రిక గడివేముల** గడివేముల మరియు పాణ్యం మండలాలకు చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సర్పంచుల పదవీకాలం ముగిసిన సందర్భంగా వారికి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రామభూపాల్ రెడ్డి .!!! ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి గారి నాయకత్వంలో ప్రజలకు సంక్షేమ,సుపరిపాలన అందించిన గడివేముల మరియు పాణ్యం మండలాలకు చెందిన సర్పంచుల సేవలను ప్రశంసించి, సర్పంచులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా సత్కరించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామభూపాల్ రెడ్డి ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే గ్రామ



అభివృద్ధికి కృషిచేసిన ప్రతి సర్పంచ్ అభినందనీయులని తెలిపారు.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలో గ్రామాభివృద్ధి దిశగా జరిగిన మార్పులు సర్పంచుల కృషి వల్లనే సాధ్యమయ్యాయని అన్నారు.. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపినందుకు సర్పంచులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు... భవిష్యత్తులో కూడా పార్టీకి బలంగా నిలిచి ప్రజాసేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.. పదవులు ఉన్నా లేకపోయినా పార్టీ కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలి, పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాటసాని రామభూపాల్ రెడ్డి అన్నారు... ఈ కార్యక్రమంలో గడివేముల జడ్పిటిసి ఆర్ బి చంద్రశేఖర్ రెడ్డి , పాణ్యం మాజీ జడ్పిటిసి సూర్యనారాయణ రెడ్డి మరియు గడివేముల, పాణ్యం మండలాల అధ్యక్షులు, నాయకులు,గ్రామ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు....

# జిల్లాలో రబి పంటకు సంబంధించి 7.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు కార్యాచరణ







## తాడేపల్లిగూడెం మండలం నుంచి 90 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఏర్పాట్లు పూర్తి

**తాడేపల్లిగూడెంబ్యూరో చీఫ్ : మార్చి 26నంది పత్రిక**

జిల్లాలో మొత్తం 7.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించి, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లుకు చర్యలు చేపట్టినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. తాడేపల్లిగూడెం మండలం మోదుగుగుంట గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అలాగే క్షేత్రస్థాయిలో కోతకు సిద్ధమైన వరి పంటను పరిశీలించారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాల (ఆర్ఎస్కేలు) ద్వారా ఏప్రిల్ 1వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుందని తెలిపారు. జిల్లాలో రబి సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యాన్ని సక్రమంగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది. ముందుగా తాడేపల్లిగూడెం మండలం నుంచే 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా గోనె సంచులు, సిబ్బంది, రవాణా సదుపాయాలను సిద్ధం చేసినట్లు వెల్లడించారు. రైతులు మధ్యదళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర (ఎంఎస్పీ)కే తమ ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. జిల్లాలో సుమారు రెండు కోట్ల గన్ని సంచులు సమీకరించామని, రైతులు వాటిని స్వీకరించే సమయంలో నాణ్యతను తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. చిరిగిన లేదా నాసిరకం సంచులను తీసుకోకూడదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు తేమ శాతం ప్రభుత్వ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని, మిల్లులకు ధాన్యం పంపే ముందు తప్పనిసరిగా ట్రక్ షీట్ జనరేట్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానంతో రైతులకు చెల్లింపులు సకాలంలో జరుగుతాయని వివరించారు. రవాణా వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్‌లను సమయానికి పునరుద్ధరించుకోవాలని, ధాన్యం కొలతలు, రవాణా లేదా చెల్లింపుల విషయంలో ఎలాంటి సమస్యలు వచ్చినా వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కోతల సమయంలో డీజిల్ కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, డీజిల్ సరఫరా విషయంలో ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ ఎండి ఇబ్రహీం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ ఆర్.గంగాధర్ రావు, ఎంఏఓ టి.నారాయణరావు, తహసిల్దార్ రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ జానకి సీతారామయ్య, సిద్ధ వీరయ్య, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.






# గూడెం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తాం:



## ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభివృద్ధి పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

**తాడేపల్లిగూడెం:బ్యూరో చీఫ్ మార్చి 26,నంది పత్రిక .** తాడేపల్లిగూడెం పట్టణంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించామని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ చేపడుతున్న పలు కీలక పనులను గురువారం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఈతకొలను, జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి, ఇండోర్ స్టేడియం నిర్మాణం వంటి పలు ముఖ్యమైన ప్రాజెక్టులను చేపట్టినట్లు తెలిపారు. 2014లో తాను మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కాలువలో ఈతకు వెళ్లిన బాలురు మృతి చెందిన ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని, అదే సమయంలో గూడెంలో ఈతకొలను నిర్మించాలని సంకల్పించామని పేర్కొన్నారు. ఆ సమయంలో పనులు ప్రారంభమైనప్పటికీ, ఎన్నికల కారణంగా మధ్యలో నిలిచిపోయాయని, అనంతరం వచ్చిన ప్రభుత్వం ఈ పనులను పట్టించుకోకపోవడంతో అవి పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తిరిగి పనులను ప్రారంభించి, ప్రస్తుతం పూర్తి స్థాయికి తీసుకువచ్చామని వివరించారు. ఈతకొలను, క్రీడా మైదానం, ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులను పి-4 విధానంలో చేపట్టినట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు శివ, అనిల్ సేవాభావంతో ఈ పనులను పూర్తి చేయడంలో విశేష కృషి చేశారని అభినందించారు. భవిష్యత్తులో ఈతకొలను ప్రాంతం పట్టణంలో ఒక ముఖ్య కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మూడు అభివృద్ధి పనులను వచ్చే నెలలో ముఖ్యమంత్రితో ప్రారంభోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చిన తర్వాత వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రజలదేనని సూచించారు. పట్టణ ప్రజలకు ఏడాది పొడవునా, ముఖ్యంగా వేసవికాలంలో కూడా మూడు పూటల రక్షిత మంచినీరు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. 53 ఎకరాల విస్తీర్ణంలో రెండవ పంపుల చెరువు నిర్మాణ పనులు పూర్తికి చేరుకున్నాయని చెప్పారు. అదేవిధంగా పట్టణానికి ఆనుకుని ఉన్న పెంటపాడు, పెదతాడేపల్లి గ్రామాలకు కూడా మున్సిపాలిటీ ద్వారా మంచినీటి సరఫరా చేయనున్నట్లు వెల్లడించారు. ఇంకా పట్టణంలో టౌన్ హాల్ నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అభివృద్ధి పనులను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం తదుపరి కార్యాచరణను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రాజరాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు, బీజేపీ ఇన్‌చార్జ్ ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి, దువ్వ శ్రీనివాస్, మద్దాల మణికుమార్, ఎన్వీ సత్యనారాయణ, కాంట్రాక్టర్లు శివ, కూచిపూడి అనిల్, బలుసు లక్ష్మణ్, వాడపల్లి సుబ్బరాజు, పైపోయిన వెంకటరామయ్య, పసల కొండ, బేటిన గిరిధర్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, మద్దిపాటి రవితేజ, పిడుగు రామ్మోహన్ (బ్రదర్స్), సత్తి జగన్ మోహన్ రావు, గట్టెం నాని, మలపాక చిట్టి, పాకనాటి తాతాజీ, మద్దిపాటి సత్యనారాయణ, కామిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు....




# మార్చి 30న టిడ్కో గృహాల ప్రారంభోత్సవాలకు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాలు

**భీమవరం:బ్యూరో చీఫ్ మార్చి 26నంది పత్రిక** టిడ్కో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లాస్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి మంగళవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మున్సిపల్, గృహనిర్మాణ, ఎంపీడీవోలు, తదితర శాఖల అధికారులతో పి-4, టిడ్కో, గృహనిర్మాణ కార్యక్రమాల పురోగతిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పి-4 కార్యక్రమంలో భాగంగా "బంగారు కుటుంబాలు" దత్తత స్వీకరణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. జిల్లాలో మొత్తం 49,118 బంగారు కుటుంబాలు అర్హత సాధించగా, వీరిలో ఇప్పటికే 22,762 కుటుంబాలను 2,331 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని వెల్లడించారు. రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు వంటి వివిధ వర్గాలకు చెందిన మార్గదర్శకులు ముందుకు వచ్చి కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా సామాజిక బాధ్యతను చాటుకున్నారని అభినందించారు. మార్చి 30న నిర్వహించనున్న జిల్లాస్థాయి పి-4 కార్యక్రమంలో ఇంకా ఆసక్తి ఉన్న మార్గదర్శకులు ముందుకు వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించనున్న టిడ్కో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి అనుసంధానంగా జిల్లాస్థాయిలో కూడా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని, ఇందుకు అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో తాడేపల్లిగూడెం 1,120, పాలకొల్లు 2,016, భీమవరం 1,920 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు మార్చి 30న అందజేయనున్నట్లు తెలిపారు. గృహనిర్మాణ శాఖ పరిధిలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో సిద్ధంగా ఉన్న 259 గృహాలను కూడా అదే రోజున లబ్ధిదారులకు అందజేయనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. జిల్లాస్థాయిలో జరిగే ఈ కార్యక్రమాల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సీపీఓ కె.శివ పార్వతి, జిల్లా గృహనిర్మాణ శాఖ అధికారి జీ.పిచ్చయ్య, జిల్లా స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి వై.దోసిరెడ్డి, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వినియోగదారులకు అందించే సేవలలో లోటుపాట్లుకు చర్యలు తప్పవు: జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి




**తాడేపల్లిగూడెంబ్యూరో చీఫ్ మార్చి 26 పత్రికనంది .** వినియోగరారులకు అందించే సేవలలో లోటుపాట్లకు చర్యలు తప్పవని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. జిల్లాలో వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతున్నాయో లేదో తెలుసుకునేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలోని సన్ రేస్ పెట్రోల్ బంక్ మరియు సాయి లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల సందర్భంగా పెట్రోల్ బంక్‌లో ఇంధన నిల్వలు, పెట్రోల్ మరియు డీజిల్ నాణ్యత, కొలతల కచ్చితత్వం, డిస్పెన్సింగ్ యంత్రాల సక్రమ పనితీరు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించారు. వినియోగదారులకు ఎలాంటి లోపాలు లేకుండా, నాణ్యమైన ఇంధనం సరఫరా చేయాలని బంక్ నిర్వాహకులను ఆయన ఆదేశించారు. అనంతరం సాయి లక్ష్మీ గ్యాస్ ఏజెన్సీని తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్, గ్యాస్ సిలిండర్ల నిల్వలు, సరఫరా విధానం, బుకింగ్ వ్యవస్థ, వినియోగదారులకు సమయానికి డెలివరీ జరుగుతున్నదా అనే అంశాలపై సమగ్రంగా విచారణ చేశారు. వినియోగదారుల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. గ్యాస్ ఏజెన్సీల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలనీ, ఎటువంటి అవకతవకలు సహించబోమని ఆయన హెచ్చరించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎక్కడా గ్యాస్, పెట్రోల్ లేదా డీజిల్ కొరత లేదని స్పష్టం చేశారు. ప్రజలు వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందేలా అధికారులు తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఎస్ఓ ఎన్.సరోజ, ఏఎస్‌వో ఎం. రవిశంకర్, తహశీల్దార్ రాజరాజేశ్వరి, డీటీ, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.




# తెరుచుకున్న హోర్ముజ్ జలసంధి సరుకు రావాణాకు ఇరాన్ అనుమతి

భారత్‌తో సహా మిత్ర దేశాలకు హోర్ముజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. హోర్ముజ్ ద్వారా సరుకు రవాణా నౌకల రాకపోకలకు అనుమతి ఇచ్చినట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి ప్రకటించారు. భారత్, చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లకు సరుకు రవాణాకు అనుమతి లభించింది. అబ్బాస్ అరఘ్చి స్పందన గురించి ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ జనరల్ ఒక ప్రకటనలో తెలిపింది. హోర్ముజ్ జలసంధిని తెరవాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ అభ్యర్థించారు. దీని నేపథ్యంలోనే ఇరాన్ ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం. మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ముగించాలని గుటెర్రెస్ అమెరికా, ఇజ్రాయిల్‌లను కోరారు. 'హోర్ముజ్ జలసంధిని మూసివేయడం చమురు, గ్యాస్ రవాణాను స్తంభింపజేస్తోంది. ఈ ప్రాంతంలో, వెలుపల పౌరులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు, అభద్రతతో జీవిస్తున్నారు. సంఘర్షణ పరిణామాలను తగ్గించడానికి పోరాటాన్ని ముగించడమే సరైన నిర్ణయం' అని గుటెర్రెస్ ఒక ప్రకటనలో రాశారు.

# పంటపొలాల్లోనే ఏనుగుల తిష్ట

చంద్రగిరి మండలం, ఎగువ కూచివారిప్లలె పంట పొలాల్లో పగలు కూడా ఏనుగులు తిష్ట వేస్తున్నాయి. దీంతో రైతులు విలవిలలాడిపోతున్నారు. కొన్ని రోజులుగా ఏనుగుల మంద గ్రామంలోని పంట పొలాలపై పడి బీభత్సం సృష్టిస్తోంది. సాధారణంగా రాత్రి వేళల్లో వచ్చే ఏనుగులు, ఇప్పుడు ఏకంగా పట్టపగలే పొలాల్లో తిష్టవేస్తుండటంతో రైతులు ప్రాణభయంతో వణికిపోతున్నారు. బుధవారం ఎగువ కూచువారి పల్లె రైతుల పొలాల్లో ఏనుగులు మామిడి తోటలు, ఇతర పంటలను తొక్కి వేయడమే కాకుండా, చెట్ల కొమ్మలను విరిచివేసి భారీ నష్టాన్ని కలిగించాయి. సాగునీటి పైపులను, మోటార్లను సైతం ధ్వంసం చేస్తున్నాయి.

# వేదమంత్రాల నడుమ ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ







**కడప ఒంటిమిట్టబ్యూరో చీఫ్ మార్చి 26 నంది పత్రిక**

మార్చి 27న ధ్వజారోహణం ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో నిర్వహించనున్న వార్షిక శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు భక్తి భావపూర్వక వాతావరణంలో వేదమంత్రాల నడుమ గురువారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది.పురాతన చారిత్రక ప్రాశస్త్యాన్ని కలిగిన ఈ ఆలయంలో ఒకే శిలపై శ్రీ సీతారామ లక్ష్మణుల దివ్య మూర్తులు వెలసి ఉండటంతో ఒంటిమిట్టను "ఏకశిలానగరం"గా కూడా పిలుస్తారు. ఈ పవిత్రక్షేత్రంలో మార్చి 26 నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు జరిగే బ్రహ్మోత్సవాల కోసం ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంతో ముస్తాబైంది. గురువారం ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవర్లకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చనలను శాస్త్రోక్తంగా చేశారు. సాయంత్రం 6 గంటల నుండి అర్చకుల వేదమంత్రాల నడుమ అంకురార్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ సీతారామ లక్ష్మణుల ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశ ప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ వంటి శాస్త్రోక్త కర్మలను నిర్వహించారు. అనంతరం పుట్టమన్ను సేకరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది.

**మార్చి 27న ధ్వజారోహణం** శుక్రవారం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. దీంతో శ్రీ కోదండరామస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం కానున్నాయి. అనంతరం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుండి 7 గంటల వరకు పోతన జయంతి కార్యక్రమం, కవి సమ్మేళనం జరుగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల వరకు శేష వాహనసేవను భక్తులు వీక్షించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, ఏఈవో బాలరాజు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీ నవీన్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.







# 22 ఏ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి:

### జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి



**భీమవరంబ్యూరో చీఫ్ : మార్చి 26నంది పత్రిక .** జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 22-ఏ భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి గురువారం రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లతో గూగుల్ మీట్ ద్వారా డివిజన్, మండలాల వారీగా 22-ఏ పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 22-ఏ భూ సమస్యల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ప్రతి గ్రామంలో 22-ఏ గ్రామ సభలను నిర్వహించి ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్ మరియు మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న 22-ఏ కేసులను సమగ్రంగా పరిశీలించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మీసేవ, పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా అందిన భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో 22-ఏ గ్రామ సభలను నిర్వహించి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత ధృవపత్రాలతో రెండు వారాలలోపు పూర్తి వివరాలతో సమర్పించాలన్నారు. ఈ గ్రామ సభలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు టామ్‌టామ్ వంటి సంప్రదాయ విధానాలను వినియోగించాలని సూచించారు. 22-ఏ కేసుల పరిష్కారానికి అవసరమైతే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వేగవంతంగా సమస్యలను పరిష్కరించాలని, ఈ విషయంలో రెవెన్యూ డివిజనల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం 22-ఏ భూ సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, రెవెన్యూ అధికారులు నూతన ఆలోచనలతో అంకితభావంతో పని చేయాలని ఆయన కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు దాసిరాజు, కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, తహసీల్దార్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శాసనసభ్యులకు క్రీడా పోటీలు

### 28 29 తేదీల్లో రెండ్రోజుల పాటు నిర్వహణ

### మంత్రులు జూపల్లి, వాకిటి శ్రీహరి వెల్లడి

రాష్ట్రంలో విద్యార్థులు యువకులు అన్ని వర్గాలకు క్రీడల ప్రాముఖ్యత తెలియజేసే విధంగా శాసన సభ్యుల క్రీడోత్సవాలు నిర్వహించబోతున్నామని రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి లు తెలిపారు. ఈనెల 28 29 తేదీల్లో జరగబోయే శాసనసభ్యులు శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలు మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 నిర్వహణ సన్నాహక సమావేశం అసెంబ్లీలోని కమిటీ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అనునిత్యం రాజకీయాల్లో బిజీ ఉండే శాసన సభ్యులు శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రజల్లో క్రీడా స్ఫూర్తిని క్రీడల పట్ల అవగాహన కలిగించేందుకు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించబోతున్నామని వారు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ పోటీలు మొట్టమొదటి సారిగా నిర్వహించబోతున్నామని, పార్టీలబేధ భావాలు పక్కనపెట్టి శాసనసభ్యులు అందరూ ఈ క్రీడల్లో పాల్గొన్న పోతున్నారని వారు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారికి వయసుల వారికి క్రీడల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.ఇందుకోసం శాసనసభ సచివాలయము తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మరియు రాష్ట్ర సాంస్కృతిక శాఖ తోపాటు వివిధ శాఖల సమన్వయంతో శాసనసభ్యులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్ శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ యశస్విని రెడ్డి , పాల్వాయి హరీష్ రావు, శాసనమండలి సభ్యులు తాత మధుసూదన్ రావు భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ ఎండి డాక్టర్ సోనీ బాలాదేవి శాసనమండలి కార్యదర్శి నరసింహచార్యులు శాసనసభ కార్యదర్శి ఆర్ తిరుపతి వివిధ క్రీడా వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొదటి ఎడిషన్ లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026 ప్రారంభ వేడుకలు ఎల్బీ స్టేడియంలో 28వ తేదీ మధ్యాహ్నం మూడున్నర గంటలకు ప్రారంభమవుతాయని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తోపాటు ఉభయ సభల వివిధ పక్ష నేతలు విప్ లు అన్ని పార్టీల శాసనసభ్యులు శాసనమండలి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొనబోతున్నారు.

# రైతన్నల సంక్షేమమే లక్ష్యం..

# మరింత అంకితభావంతో పనిచేస్తా





### మంత్రి అచ్చెన్నాయుడు

### - ప్రజాభివృద్ధే లక్ష్యంగా సుదీర్ఘ సేవ... అచ్చెన్నపై సీఎం ప్రశంసల వర్షం

### - సచివాలయంలో సీఎం చంద్రబాబు , మంత్రి లోకేష్ సమక్షంలో మంత్రి అచ్చెన్న పుట్టినరోజు వేడుకలు

### - సీఎం చంద్రబాబు ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను పెంచాయన్న మంత్రి అచ్చెన్న

**అమరావతి, బ్యూరో చీఫ్ మార్చి 26నంది పత్రిక** వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పుట్టినరోజు సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో సీఎం ఛాంబర్‌లో మంత్రుల సమక్షంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వయంగా కేక్ కట్ చేయించి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే యువనేత, మంత్రి నారా లోకేష్ సమక్షంలో క్యాబినెట్ మంత్రులంతా కలిసి కేక్ కట్ చేసి మంత్రి అచ్చెన్నాయుడికి తినిపిస్తూ ఆత్మీయ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి అచ్చెన్నాయుడు చేసిన కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. సుదీర్ఘకాలంగా ఎమ్మెల్యేగా ప్రజల అభ్యున్నతికై నిత్యం ఆలోచిస్తూ, మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఆయా శాఖల అభివృద్ధికి పాటుపడి రాష్ట్ర పురోగతికి బాటలు వేసిన నాయకుడిగా ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ సమక్షంలో తన జన్మదిన వేడుకలు జరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి తనపై ప్రత్యేక వాత్సల్యంతో స్వయంగా కేక్ కట్ చేయించి ఆశీర్వదించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన యువనేత నారా లోకేష్, మంత్రివర్గ సహచరులు, ప్రజాప్రతినిధులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి ఆత్మీయత, ఆశీస్సులు తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి, రైతన్నల సంక్షేమం కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.



# నిమ్స్‌లో చికిత్స పొందుతున్న గద్దర్ భార్య విమల

### పరామర్శించిన భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్

దివంగత ప్రజా గాయకుడు గద్దర్ సతీమణి విమల నిమ్స్ లో గాల్ బ్లాడర్ సమస్యతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. మూడు రోజుల క్రితం నిమ్స్ లో చేరిన విమల గారికి నేడు సర్జరీ జరగనుంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ లు కొద్దిసేపటి క్రితం నిమ్స్ లో డైరెక్టర్ బీరప్పను కలిసి విమల కు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. విమల వెంట కుమారుడు సూర్యం కుటుంబ సభ్యులు ఉన్నారు.

# మార్కాపురం బస్సు ఘటనపై మంత్రి పొంగులేటి విచారం

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లా పరకాల క్వారీ సమీపంలో టిప్పర్‌ను ఢీకొని జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరం అని పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ప్రమాదంలో బస్సు అగ్నికి ఆహుతి కావడంతో పలువురు ప్రయాణికులు ప్రాణాలు కోల్పోవడం, మరికొందరు తీవ్రంగా గాయపడటం మనసును తీవ్రంగా కలచివేసింది. విషాద ఘటనలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. బాధిత కుటుంబాలకు ధైర్యం చేకూరాలని ప్రార్థిస్తున్నాను. గాయపడిన వారికి అత్యవసర మెరుగైన వైద్యం అందించేందుకు ఏపీ ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నాను.

## సిఎంతో సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం భేటీ

తెలంగాణ శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందం కలిసింది. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజా వాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్ళేందుకు ఈ భేటీలో సమాలోచనలు జరిగాయి. అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు.

రాజస్థాన్ ప్రభుత్వం చేపడుతున్న జన్ సూచన పోర్టల్ తరహాలో తెలంగాణ లోనూ 'ప్రజా సూచన పోర్టల్ ' ఏర్పాటు చేయాలని చర్చ జరిగింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోటఈ పోర్టల్ లో అందుబాటులో ఉంచుతారు. ఐటీ శాఖ ద్వారా ఈ పోర్టల్ ను అభివృద్ధి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ బిల్ ను నిఖిల్ డే ప్రశంసించారు. ఈ బిల్ దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఆళ్లగడ్డ కోర్టు బార్ అసోసియేషన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా..

### సీనియర్ న్యాయవాది చింతకుంట శివరామిరెడ్డి

**ఆళ్లగడ్డ ప్రతినిధి మార్చి 26 నంది పత్రిక** ఆళ్లగడ్డ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది చింతకుంట శివరామిరెడ్డి 5 వ పర్యాయం ఏకగ్రీవంగా ఎంపిక అయినట్లు ఎలక్షన్ ఆఫీసర్ నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ పదవీకాలం ముగియడంతో ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని కాగా అనూహ్యంగా గత ప్రెసిడెంట్ శివరామిరెడ్డి నే తిరిగి అసోసియేషన్ సభ్యులందరూ నూతన అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కోర్టు బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన అభినందన సభలో నూతన అధ్యక్షుడు శివరామి రెడ్డిని, సభ్యులను బారాసోసియేషన్ ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శివరామిరెడ్డి మాట్లాడుతూ.. తనను ఐదవ పర్యాయం కూడా కూడా అధ్యక్షునిగా ఎన్నుకున్న న్యాయవాదులు అందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బార్ అసోసియేషన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, బార్ లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టు నూతన బెంచి ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**నూతన కార్యవర్గం వీరే.** ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా చింతకుంట శివరామిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ గా ప్రభాకర్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా షాహినా బేగం, అవుకు వెంకటయ్య, కోశాధికారిగా లక్ష్మీ శ్రావణి, లైబ్రేరియన్ గా దాదా పీర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రముఖ న్యాయవాదులు బివి సుబ్బారెడ్డి, ఏపీపీ శివప్రసాదరావు, ఏ జి పి బాలగురెడ్డి, జయచంద్రా రెడ్డి, రమణయ్య, మురళి బాబు, సుధాకర్, షేక్ బాబా పక్రుద్దీన్ తిరుపాల్రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ట్రంప్ మూర్ఖానికి ప్రపంచదేశాలు మూల్యం !

అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఈ సంవత్సరపు అతిపెద్ద విలన్లుగా ప్రపంచంలో అవతరించారు. తమ యుద్ధ దాహానికి ప్రపంచాన్ని బలి తీసుకున్నారు. ఆయుధ సంపత్తి ఉందికదా అని ఇరాన్‌పై విచ్చలవిగిగా జరిపిన బాంబు దాడిలో ఇప్పటికే ఇరాన్ బాగా దెబ్బతింది. ఇరాన్ దాడుల్లో గల్ఫ్ దేశాలు కూడా దెబ్బిన్నాయి. ఈ క్రమంలో ఏం సాధించారో ట్రంప్ ప్రపంచానికి చెప్పాలి. గతంలో ఇరాక్‌లో ఇలాంటి దడి చేసి సద్దాం హెస్సేన్‌ను ఉరేశారు. ఇక్కడ ఖమేనీని చంపేశారు. వీరి యుద్ధాలు ప్రపంచానికి సంకటంగా మారాయి. ట్రంప్ తీరుతో ప్రపంచం కొరివితో తలగోక్కున్నట్లుగా తయారయ్యింది. ఇరాన్‌ను లొంగదీసుకుంటానని ప్రగల్భాలు పలికిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. క్రమంగా వెనక్కి జారుకున్నారు. చర్చలు జరుగుతు న్నాయని, ఐదు రోజులపాటు యుద్ధానికి విరామం ఇస్తున్నామని ప్రకటించారు. అయితే, ఇరాన్ మాత్రం.. యుద్ధం మొదలైనప్పటి నుంచీ ఇప్పటి వరకూ.. తమకూ అమెరికాకు మధ్య ఎటువంటి చర్చలు జరగలేదని, తాము చర్చలకు సిద్ధంగా లేమని స్పష్టం చేసింది. మీరు దాడులు మొదలు పెట్టి మీరే షరతులు పెడతారా అని నిలదీసింది. మేమూ షరతలు పెడతామని చెప్పింది. మొత్తమ్మీద, ట్రంప్ మాటలకు విశ్వసనీయత లేద ని, రోజుకో మాట మాట్లాడటమే ఆయన తీరని మరోసారి రుజువైంది. ఏదేమైనా.. ట్రంప్ వెనక్కి తగ్గటం మాత్రం కాదనలేని వాస్తవం. ట్రంప్ తీరుపై స్వదేశంలోనూ తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇజ్రాయిల్ కోల్పోయిందేమీ లేదు క ఆనీ, అమెరికా భారీగా నష్టాన్ని మూటగట్టుకుంది. ఓ రకంగా చెప్పాలంటే యుద్ధంలో ఇరాన్ గెలిచిందనే చెప్పాలి. ఇరాన్ మీద కయ్యానికి కాలు దువ్వినప్పుడు అమెరికా–ఇజ్రాయెల్ లకు ఓ స్పష్టమైన లక్ష్యం లేదు. ఖమేనీ సారథ్యంలోని ప్రభుత్వాన్ని పడగొడతామని ఒకసారి, ఇరాన్ అణ్వాయుధాలను తయారు చేయకుండా చూడటం అని మరోసారి, ఇరాన్ నుంచి అమెరికాకు ముప్పు పొంచి ఉందని, ఆ దేశాన్ని లొంగదీసుకుంటామని ఇంకోసారి.. ఇలా పూటకో మాట చెప్పారు ట్రంప్. మరోవైపు, తమ మీద రుద్దిన ఈ యుద్ధాన్ని ఎదుర్కొని తమ దేశ సమగ్రతను కాపాడుకునే ఏకైక, స్పష్టమైన లక్ష్యంతో ఇరాన్ యుద్ధంలోకి దిగింది. అంతులేని యుద్ధాలకు ముగింపు పలుకుతానని, అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా మారుస్తానంటూ రెండోసారి అధికారంలోకి వచ్చిన ట్రంప్.. అమెరికాకు ఏ విధంగానూ అవసరం లేని యుద్ధం చేస్తున్నారన్న భావన అమెరికన్లలో వ్యాపించింది. తాము కట్టిన పన్నుల్ని నెతన్యాహూ కోసం ఎందుకు ఖర్చు చేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు, అమెరికాలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత పెరిగాయి. స్థిరచిత్తం లేని ట్రంప్ మాటలతో, చేతలతో అమెరికా అధ్యక్ష పదవి ఓ జోకులాగా తయారైంది. స్వయంగా ట్రంప్ మద్దతుదారులు కూడా ఈ యుద్ధాన్ని సమర్థించటం లేదు. సర్వేల్లో ట్రంప్ ప్రజాదరణ రోజురోజుకీ దిగజారుతోంది. మరోవైపు, ఈ ఏడాది చివర్లో అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికలు జరగనున్నాయి. అధికారపక్షమైన రిపబ్లికన్ పార్టీకి పరిస్థితులు ఏమాత్రం సానుకూలంగా లేవన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే, తాజాగా వెనక్కి తగ్గారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వెనెజువెలాలో అధ్యక్షుడు మదురో అధికారిక నివాసంపై దాడి చేసి రాత్రికి రాత్రి కిడ్నాప్ చేసి అమెరికాకు తీసుకొచ్చిన ట్రంప్.. ఇరాన్ మీద కూడా అదే ఎ÷–లాన్ అమలు చేయాలని భావించారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ రాజధాని టెహ్రాన్‌లో సైనిక, పౌర ఉన్నతాధికారులతో సమావేశమైన తరుణంలో వారి మీద అమెరికా, ఇజ్రాయెల్ అకస్మాత్తుగా బాంబులు కురిపించాయి. వారిని హత్య చేసి యుద్ధం ప్రారంభించాయి. ఖమేనీ హత్య తర్వాత.. అప్పటి వరకూ ఉన్న అంతర్గత విభేదాలు, ప్రభుత్వం మీద ఉన్న అసమ్మతిని కూడా పక్కనపెట్టి.. దేశ పరిరక్షణకు యావత్ ఇరాన్ ఒక్కటైంది. ఆ దేశంలోని ప్రతీ పట్టణంలో.. ఓవైపు క్షిపణులు, బాంబులు పడుతున్నా కూడా బెదరకుండా.. రోడ్ల మీదికి పెద్ద సంఖ్యలో వచ్చి ప్రభుత్వానికి మద్దతు ప్రకటిస్తూ ర్యాలీలు జరిపారు. ఇప్పటికీ ఇవి కొనసాగుతున్నాయి. ఇరాన్ బలాబలాలేమిటి అన్నది సమగ్రంగా సమీక్షించకుండానే ట్రంప్ ఈ యుద్ధంలోకి దిగారు. అమెరికా సైన్యాధికారులతో సంప్రదించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు నేతృత్వంలోని శక్తిమంతమైన యూదు లాబీ మాటలువిని ట్రంప్ యుద్ధం నిర్ణయం తీసుకున్నారని స్వయంగా అమెరికా ఉగ్రవాద నిరోధక విభాగం డైరెక్టర్ జో కెంట్ వెల్లడించి నిరసనగా పదవికి రాజీనామా చేశారు. గల్ఫ్ మొత్తానికి యుద్ధాన్ని విస్తరిస్తుందని ట్రంప్, నెతన్యాహు ఊహించి ఉండరు. ఇక హొర్ముజ్ జలసంధిని అడ్డుకోవటం ద్వారా ఇరాన్ తన వద్ద ఉన్న బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించింది. దీంతో యుద్ధం ప్రభావం యావత్ ప్రపంచం మీద పడింది. దీనికి ట్రంప్ దూకుడే కారణం. ప్రపంచం యావత్తూ గ్యాస్, ఇంధనాల కొరతతో అల్లుడుతోంది. ఆయా దేవాల ఆర్థిక స్థితి దారుణంగా పడిపోయింది. ఇప్పట్లో ఈ నష్టాల నుంచి కోలుకోవడం ఎవరికైనా కష్టమే.

# కోమాలోకి ఉపాధి మహిళా కూలి



**బండి ఆత్మకూరు నంది పత్రిక మార్చి 26:** ఉపాధి కూలీ పనికి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడి ఆసుపత్రి పాలైన సంఘటన వెలుగులోకి వచ్చింది. బండి ఆత్మకూరు మండల పరిధిలో ఉన్న సోమయాజుల పల్లె గ్రామానికి చెందిన భూమా వెంకట లక్ష్మమ్మ (56) అనే మహిళ బుధవారం ఉపాధి పనికి వెళ్ళింది. పని అయిపోయిన తర్వాత ద్విచక్ర వాహనం పై వస్తూ ప్రమాదవశాత్తు వాహనంపై నుండి కిందపడి తలకు గాయమైందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే వెంకట లక్ష్మమ్మ బంధువులు ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటన తెలిసిన వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురువారం రాత్రి నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు. డాక్టర్లతో ఆమె ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్న మేరకు ఆమె పరిస్థితి విషమంగా ఉందని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష కార్యదర్శులు కుళాయి స్వామి డేవిడ్ పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి నరసింహ నాయక్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి భూమా వెంకటలక్ష్మి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వెంకట లక్ష్మమ్మకు మెరుగైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ వసుధారెడ్డి దృష్టికి తేగా ఈ విషయంపై సమాచారం అందజేయడంలో ఫీల్డ్ అసిస్టెంట్ అజాగ్రత్త వహించాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీవో వసుధ రెడ్డి వివరించారు. గురువారం రాత్రి ఏపీవో వసుధారెడ్డి నంద్యాల ప్రభుత్వాసుపత్రి కి చేరుకొని భూమా వెంకట్ లక్ష్మమ్మ తోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటలక్ష్మి ఆరోగ్య పరిస్థితులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ విషయాన్ని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్లడం జరుగుతుందని ఏపీవో వసుధ రెడ్డి పేర్కొన్నారు.



# ఉన్నత విద్యకు 'కొత్త' గ్రహణం







ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణకు విశ్వవిద్యాలయాల నిధుల సంఘం(యూజీసీ) స్థానంలో ఒక కొత్త సంస్థను ఏర్పాటు చేసేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం పూనుకున్నది. ఆ సంకల్పంతోనే 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్' (వీబీఎస్ఏ) బిల్లును ప్రతిపాదించింది. యూజీసీ మాజీ సభ్యుడుగా ఆ ఉన్నత విద్యా సంస్థ రద్దుకు నేను ఒక్క కన్నీటి బొట్టు కూడా కార్చను. ఎందుకని? యూజీసీ ఒక విఫల వ్యవస్థ. విద్యావేత్తలేకాదు, విధాన రూపకర్తలు సైతం ఈ విషయమై ఏకాభిప్రాయంతో ఉన్నారు. అయితే జాతీయ నూతన విద్యా విధానం (ఎన్‌పీఏ)2020 వాగ్దానం చేసినట్టుగా యూజీసీ స్థానంలో ఒక నూతన నియంత్రణ వ్యవస్థగా వీబీఎస్ఏ ఆవిర్భవిస్తే దానికి నేను సంతోషంగా మద్దతునిస్తాను. ఎన్‌పీఏ వాగ్దానం చేసిన సంస్థ ఎలా ఉంటుందో కూడా ఒకసారి గుర్తుచేస్తాను: 'వ్యవస్థలో నిరోధ సమతౌల్యాలను వ్యవస్థీకరించి, ప్రయోజనాల సంఘర్షణను సాధ్యమైనంతగా తక్కువ స్థాయిలో ఉంచుతూ అధికారాల కేంద్రీకరణను రూపుమాపే స్వతంత్ర, సాధికార సంస్థ ఒకటి ఉన్నతవిద్యా వ్యవస్థకు అత్యవసరం'. విచారకరమైన విషయమేమిటంటే ప్రస్తుతం పార్లమెంటు స్థాయీ సంఘం పరిశీలనలో ఉన్న ప్రతిపాదిత వీబీఎస్ఏ బిల్లు ఎన్‌పీఏ దార్శనికతకు విరుద్ధంగా ఉన్నది. కొత్త నియంత్రణ నిర్మాణం అధికారాల కేంద్రీకరణకు దోహదం చేసేదిగా ఉన్నది. ఇది ఉన్నత విద్య కేంద్రీకరణ, అధికార యంత్రాంగం పెరుగుదల, ఉన్నత విద్య వాణిజ్యీకరణకు దారి తీసేదిగా ఉన్నది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రస్తుత యూజీసీ వ్యవస్థకంటే రాబోయే వీబీఎస్ఏ వ్యవస్థ మరింత అధమమైనది. ఉన్నత విద్య సమున్నత లక్ష్యాల పరిపూర్తికి అది దోహదం చేయగలదని భావించడం ఒక భ్రమ మాత్రమే. 201013 సంవత్సరాల మధ్య యూజీసీ గౌరవ సభ్యుడిగా ఉన్న కాలంలో దేశ ఉన్నత విద్యా వ్యవహారాల నిర్వహణ ఎలా ఉంటుందో, అవి ఎలా నిర్దేశితమవుతాయో చాలా దగ్గరగా పరిశీలించే అవకాశం నాకు లభించింది. యూజీసీ ఒక అవినీతికర, అసమర్థ సంస్థ. ప్రయోజనాల సంఘర్షణ కూడా యూజీసీలో ముమ్మరంగా ఉన్నది. యూజీసీకి బాధ్యత వహించే విద్యావేత్తలు కేంద్ర ప్రభుత్వంలోని ఒక మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ నుంచి ఫోన్ వస్తే చాలు, ఎంతో విధేయంగా లేచి నిలబడి మరీ మాట్లాడడం పరిపాటి. ఇది నమ్మవలసిన నిజం. యూజీసీ స్వయం ప్రతిపత్తి అనేది కాగితాలకే పరిమితమైన విషయం. యూజీసీలో మొట్టమొదటి అధికారిక ప్రయోజనాల సంఘర్షణకు మార్గదర్శకాలను ఆమోదింపజేయడం ఆ సంస్థ గౌరవ సభ్యుడిగా నేను సాధించిన ఏకైక విజయం. వాటి ప్రకారం, యూజీసీ కమిటీల సభ్యులు తమకు ఏవైనా సంభావ్య ప్రయోజన వైరుధ్యాలు ఉంటే వాటిని ప్రకటించాలి. తమకు భాగస్వామ్యం లేదా ప్రమేయమున్న సంస్థలకు సంబంధించిన నిర్ణయాల నుంచి వైదొలగాలి. అయితే నేను ప్రవేశపెట్టిన ఈ విధానమే నన్ను యూజీసీ నుంచి తొలగించేందుకు దారితీసింది! రాజకీయ క్రియాశీలత అన్న ఆరోపణపై నన్ను తొలగించారు. చెప్పవచ్చినదేమిటంటే యూజీసీ వ్యవస్థ ఉన్నతస్థాయి నుంచి సకల అధర్మాచరణలతో భ్రష్టుపట్టిపోయింది. దాన్ని పై నుంచి కింది దాకా సర్వసమగ్రంగా సంస్కరించవలసిన అవసరమున్నది. ఇది నా ఒక్కడి అభిప్రాయం మాత్రమే కాదు. 2009లో ప్రొఫెసర్ యశ్‌పాల్ నేతృత్వంలోని ఒక కమిటీ కూడా ఇటువంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేసింది. 'భారతదేశంలో ఉన్నత విద్య పునరుద్ధరణ, పునరుజ్జీవనం' పేరిట ఉన్న ఆ నివేదికను ప్రస్తుత సందర్భంలో చదవడం సత్ఫలితాల నివ్వగలదు. ఉన్నత విద్య ఒక వ్యాపార సరుకుకాదని, అది ఒక ప్రజా ప్రయోజనమని ఆ నివేదిక పేర్కొంది. విశ్వవిద్యాలయం ప్రాథమిక ఉద్దేశం జ్ఞాన సృష్టి, విమర్శనాత్మక ఆలోచనను పెంపొందించడం, ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించడమని స్పష్టం చేసింది. ఉన్నత విద్యారంగం లాభాపేక్షతో నడిస్తే ఆ సమున్నత లక్ష్యాలను సాధించలేమని యశ్‌పాల్ కమిటీ అభిప్రాయపడింది. ఉన్నత విద్యారంగంలో ప్రమాణాలు నాణ్యమైనవిగా ఉండాలంటే ప్రభుత్వం నిధులు ఉదారంగా అందించాలని, విద్యా వ్యాపారీకరణ, విద్యా ప్రమాణాల పతనాన్ని అరికట్టేందుకు కఠినమైన నియంత్రణ ఉండాలని నివేదిక సిఫారసు చేసింది. ప్రస్తుత వీబీఎస్ఏ బిల్లు ప్రతిపాదనలు యశ్‌పాల్ కమిటీ సిఫారసులకు విరుద్ధంగా ఉన్నాయి. ఈ బిల్లు చట్టంగా అమలులోకి వస్తే మూడు ప్రతికూల పరిణామాలు ఏకకాలంలో సంభవిస్తాయి: ఉన్నత విద్యా సంస్థలు స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోతాయి; బోధనా సిబ్బందికి విద్యా సంబంధ స్వేచ్ఛ కొరవడుతుంది; ఉన్నత విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం తగ్గిపోతుంది. ఇవి ఉన్నత విద్య ప్రజా ప్రయోజనాలను నెరవేరుస్తాయా? సామాజిక న్యాయానికి దోహదం చేస్తాయా? సమాధానాలు స్పష్టమే. ఉన్నత విద్యా వ్యవస్థకు సంబంధించి కొత్త శాసన నిర్మాణంగా ఉద్దేశించినప్పటికీ వీబీఎస్ఏ బిల్లు నిజానికి 2018లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన భారత ఉన్నత విద్యా కమిషన్ (హెచ్ఈసీఐ) కొత్త అవతారమే, సందేహం లేదు. హెచ్ఈసీఐ బిల్లు శాసనంగా రూపుదాల్చినప్పుడు అధికారాలు కేంద్రీకృతమై ఉన్నత విద్యావ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, నిధుల లభ్యతను కోల్పోతుందని విద్యావేత్తలు, విద్యార్థిలోకం, రాజకీయ పక్షాల నుంచి తీవ్ర భయాందోళనలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఆ బిల్లును ఉపసంహరించుకోక తప్పలేదు. అధికారాల కేంద్రీకరణ సమస్య గురించి నేటి కొత్త బిల్లు పట్టించుకోలేదు. పైగా అదే లక్ష్యాన్ని అధికారాల కేంద్రీకరణ సాధించేందుకు మరింత సంక్లిష్ట సంస్థలను సృష్టించింది. సర్వాధికార హెచ్ఈసీఐకు బదులుగా మూడు వేర్వేరు సంస్థల రెగ్యులేటరీ కౌన్సిల్, అక్రిడిటేషన్ కౌన్సిల్, అకడమిక్ స్టాండర్స్ కౌన్సిల్ ను పర్యవేక్షించే వీబీఎస్ఏ అనే సర్వోన్నత సంస్థ ఉనికిలోకి రానున్నది. అయితే అధికారాల కేంద్రీకరణ అనే మౌలిక లక్ష్యంలో ఎటువంటి పట్టు విడుపులు లేవు. ఆ మాటకొస్తే ఇది గతంలో కంటే మరింత దృఢతరమైనది. నాలుగు కీలక విషయాలలో ఈ మార్పును స్పష్టంగా చూడవచ్చు. మొదటిది: ఈ కొత్త సంస్థల జాతీయ విద్యా నియంత్రణ మండలి, జాతీయ అక్రిడిటేషన్ కౌన్సిల్, ఉన్నత విద్యా నిధుల మండలి, సాధారణ విద్యా మండలి వ్యవస్థకు ఎటువంటి స్వతంత్ర ప్రతిపత్తి లేదు. ఇవి వేర్వేరు విభాగాలే కానీ స్వతంత్రమైనవి కావు. వీబీఎస్ఏ, అది పర్యవేక్షించే మూడు సంస్థలు నిర్మాణ పరంగా ఒకే విధమైనవి. సంస్థ చైర్మన్‌ను, సభ్యులను పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలకు ప్రాతినిధ్యం వహించేవారిని కూడా కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. తన ఇష్టానుసారం చైర్మన్, సభ్యులను తొలగించే అధికారం, మొత్తం కమిషన్‌ను కొనసాగించడం లేదా రద్దు చేసే అధికారం కేంద్రానికి ఉన్నది. తమ రాజకీయ యజమానుల తరఫున కొంతమంది ఐఏఎస్ అధికారులు వీబీఎస్ఏ వ్యవహారాలను నియంత్రిస్తారు. రెండోది: ఉన్నత విద్యావ్యవస్థ నియంత్రణ 'సులభంగా, పటిష్ఠంగా' ఉంటుందని నూతన విద్యా విధానం2020 ఇచ్చిన హామీకి విరుద్ధంగా వీబీసీఏకు బలవంతంగా జోక్యం చేసుకునే అధికారాలను కల్పించారు. గతంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు గానీ, మరే ఇతర ఉన్నత విద్యా నియంత్రణ సంస్థకు గానీ ఇటువంటి అధికారాలు లేవు. తన పర్యవేక్షణలోని మూడు సంస్థల సిఫారసుల మేరకు ఉన్నత విద్యా సంస్థలు, వాటి నిర్వాహకులను శిక్షించేందుకు, ఒక డిగ్రీకి గుర్తింపును రద్దు చేసేందుకు, ఒక కళాశాల లేదా ఒక విశ్వవిద్యాలయాన్ని మూసివేయాలని ఆదేశించేందుకు వీబీసీఏకు సంపూర్ణ అధికారాలు ఉన్నాయి. మూడోది: సమాఖ్య నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేయడమనేది వీబీఎస్ఏ బిల్లులోని ఒక ప్రధాన ప్రతికూల అంశం. బహుశా అది దాని అత్యంత చెడ్డ లక్షణమని చెప్పవచ్చు. ఇప్పటికీ అత్యధిక విద్యార్థులు ఉండే ఉన్నత విద్యా సంస్థలకు నిధులు మంజూరు చేస్తూ వాటి వ్యవహారాలను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలకు వీబీఎస్ఏను నడపడంలో ఎటువంటి ప్రమేయం ఉండదు. 15 మంది సభ్యులలో ఒక స్థానానికి ఏటా ఒకరిని ఎంపిక చేయడం మినహా మరెలాంటి ప్రవేయానికి ఆస్కారం లేదు. ఇది కూడా వీబీఎస్ఏ ఆధ్వర్యంలోని మూడు సంస్థలకూ వర్తించదు. 2018 బిల్లు ఒక బలహీన సంప్రదింపుల వేదికను సమకూర్చింది. కేంద్ర విద్యామంత్రితో పాటు రాష్ట్ర ఉన్నత విద్యా మండళ్ల చైర్‌పర్సన్లతో కూడిన ఒక సలహా సంఘం ఉండాలని ఆ పాత బిల్లు నిర్దేశించింది. వీబీఎస్ఏ బిల్లు ఈ మాత్రం వెసులుబాటును కూడా ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు కళాశాలలు, విశ్వవిద్యాలయాలను నెలకొల్పితే వాటి బోధనా సిబ్బంది నియామకాలు, పాఠ్య ప్రణాళికలు, ఆ విద్యాసంస్థలు పనిచేయాల్సిన తీరుతెన్నులను కేంద్రమే నిర్ణయిస్తుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే ఆ విద్యా సంస్థల మనుగడ అనేది కేంద్ర నిర్ణయంపై ఆధారపడి ఉన్నది. చివరగా గమనార్హమైన విషయమేమిటంటే 2018 బిల్లు వలే ప్రస్తుత వీబీఎస్ఏ బిల్లు కూడా నియంత్రణ విధులను, నిధుల కేటాయింపు నుంచి వేరు చేసింది. అయితే నిధులు ఎక్కడ నుంచి వస్తాయి, ఎలా కేటాయిస్తారు అనే విషయమై కొత్త బిల్లులో ఒక్క మాట కూడా లేదు. అలాగే ఉన్నత విద్యా సంస్థలలో వివక్షకు తావులేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించే విషయమై ఎటువంటి నిబంధన లేదు. ఈ విషయమై కొత్త బిల్లు ఎందుకు మౌనం వహించింది? ఈ మౌనం వీబీఎస్ఏ ఎలా పనిచేసేది సూచించడం లేదూ? దీనినెలా అర్థం చేసుకోవాలి? ఉన్నత విద్యను మార్కెట్ ఆధారిత వస్తువుగా మార్చడం ద్వారా, ఆ రంగం బాధ్యతల నుంచి ప్రభుత్వం వైదొలగడాన్ని అధికారికం చేసే ఒక యంత్రాంగంగా వీబీఎస్ఏను ఉద్దేశించారని భావించవచ్చు. విద్య ద్వారా పేదరికం నుంచి విముక్తమయ్యేందుకు ఆరాటపడుతున్న లక్షలాది మొదటి తరం విద్యార్థులకు అందుబాటులో ఉండే ప్రభుత్వ విద్య అత్యవసరమైన ప్రస్తుత తరుణంలో వీబీఎస్ఏ ద్వారా వారికి న్యాయం .

# ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి

## సర్వే నుంచి రిజిస్ట్రేషన్ వరకు.. అంతా ఒకే గొడుగు కిందకు

## ఒకే క్లిక్‌తో సమస్త భూ సమాచారం

## ప్రతి సర్వేనెంబర్‌కు భూధార్ నెంబర్

## రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ( ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్) ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి ఆలోచన మేరకు తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్/ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్– డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకురావడం జరిగిందన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్?వసాయ భూములకు సంబంధించి క్రయ విక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు. ఒక క్లిక్ తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు. అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్ బోర్డు సేవలకు సంబంధించి మైల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్ ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు.

printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 GST No:-37ACDFM5465G1Z1 EDITOR; Mahesh Babu RNI No: Aptel/2023/88162 Phone No 9849499960,9059696959 Email id: Nandi patrika @gmail.com